ప్రజాశక్తి | స్నేహ
ఆదివారం అనుబంధం
మార్చి 26, 2017

కవి కోకిల కూసిన వేళ...

NAVEEN PRASAD
VISAKHAPATNAM
Cell · 9849070838



బొమన్ ఇరానీ ఒమివైద్య సల్మాన్ ఖాన్

వెరైటీ పేర్లు



షారుఖ్ ఖాన్
దీపిక పదుకొనే

బాలీవుడ్ చిత్రాల్లో రాజ్, కరణ్, విజయ్, ఇలా కొన్నిపేర్లు హీరోలకి స్థిరపడిపోయాయి. ఇక హీరోయిన్లకైతే సిమ్రన్, మీరా, సీమా, రాధా పేర్లే ఎక్కువగా వినిపిస్తాయి.. ఇలాంటి రొటీన్ పేర్లకి భిన్నంగా కొన్ని చిత్రాల్లో పాత్రోచితంగా కొన్ని వెరయిటీ పేర్లని డిసైడ్ చేశారు మన డైరెక్టర్లు, స్టోరీ రైటర్లు. నోరుకూడా తిరగని అలాంటి ఫన్నీ పేర్లు తారలకి మంచి గుర్తింపుని తెచ్చిపెట్టేశాయి. ఏ చిత్రాల్లో తారలు ఎలాంటి ఫన్నీ పేర్లతో మన ముందుకొచ్చారో తెలుసుకోండి మరి.

ఒకప్పుడు హాస్య నటులు, సహాయ నటుల పాత్రని బట్టీ ఇలాంటి ఫన్నీ పేర్లని కనిపెట్టే వారు. 'మున్నా భాయ్ ఎంబిబిఎస్' నుంచి ఈ ఫన్నీ పేర్ల ట్రెండ్ ప్రధాన పాత్రధారుల పేర్లలో కనిపిస్తుంది. ఆ సినిమాలో 'సర్క్యూట్' పేరుతో ప్రేక్షకుల ముందుకొచ్చిన అర్షద్ వారాసి చాలా కాలం ఆ పేరుతోనే గుర్తుండిపోయాడు. 'త్రీ ఈడియట్స్'లో నటుల పాత్రలే కాదు వాళ్ల పేర్లు అంతే వెరయిటీగా అనిపిస్తాయి. ఆ వెరయిటీ పేర్లలో మన అమీర్ పేరు మీకు గుర్తుందా. అదే నండి 'ఫున్సుక్ వాంగ్డూ'. ఇక జావేద్ జాఫెరి, ఒమి వైద్య, బొమన్ ఇరానీల పేర్లు 'రచ్చొ దాస్ ష్యామల్ దాస్ చంచద్', 'చతుర్ రామలింగమ్ (సైలెన్సర్)', 'వీరు సహస్రబుధీ (వైరస్)' పేర్లు భలేగా నవ్వుతెప్పించాయి. ఆ తర్వాత వచ్చిన చిత్రం 'పి.కె'లో అనుష్క శర్మ 'జగజ్జనని', మన అమీర్‌కి ' పి.కె' పేర్లు మంచి గుర్తింపే ఇచ్చాయి. సల్మాన్ కూడా 'దబాంగ్'లో చుల్‌బుల్ పాండేగా ఇదే ట్రెండ్‌ని ఫాలో అయ్యాడు. 'చెన్నయ్ ఎక్స్‌ప్రెస్', 'హౌస్‌ఫుల్-2'లో 'మీనమ్మలోచిని అజ్హాంగుసుందరమ్', 'సౌందర్య భాగ్యలక్ష్మి వెంకటేశ్వరీ బసపరావ్' లాంటి తికమక పేర్లు దీపికాపదుకోన్‌కి కొత్త ఇమేజ్‌ని తెచ్చాయని ప్రత్యేకంగా చెప్పాలా. 'హంప్టి శర్మకి దుల్హనియా', 'బద్రి నాథకి దుల్హనియా' చిత్రాల్లో 'హంప్టి శర్మ', 'బద్రినాథ్ బన్సాల్'లాంటి పేర్లతో ప్రేక్షులని ఆకట్టుకుంటున్నాడు వరుణ్ ధావన్.

అమీర్ ఖాన్
అనుష్క శర్మ

సంజయ్‌దత్
అర్షద్ వార్సి

విజేత

విరాలి పోరు

ముంబయ్ సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై అప్పుడే ట్రెయిన్ ఆగింది. కిటకిటలాడుతున్న జనంలో.. ఒకరినొకరు తోసుకుంటూనే ట్రెయిన్ ఎక్కేస్తున్నారు. తన వీల్ చెయిర్‌ని తోసుకుంటూ వచ్చి పిహెచ్ కోచ్ ముందు ఆగిన విరాలి లోపలికి ఎక్కేందుకు ప్రయత్నిస్తోంది. ఇరుకుగా వున్న మార్గంలో లోనికెళ్లడం తనకి సాధ్యపడలేదు. అటుగా వస్తున్న ముగ్గురు పోర్టర్లని సాయమడిగింది. వీల్ చెయిర్ నుంచి ఎత్తి ట్రెయిన్‌లోకి తనని ఎక్కించే క్రమంలో ఒకతను అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో తను స్పందించలేక పోయింది. ప్రతిఘటించే ధైర్యం లేక కాదు... కేకలేస్తే అక్కడే పడేసి పారిపోతారనే భయం తన ప్రతిచర్యకి అడ్డుపడ్డాయి. ఇది ఒక్క విరాలి విషయంలోనే కాదు... చాలామంది ట్రెయిన్ ప్రయాణాల్లో ఇలాంటి సమస్యలనే ఎదుర్కొంటు న్నారు. ట్రెయిన్‌లో వికలాంగులకి ప్రత్యేక సదుపాయాలు కల్పిస్తే ఇలాంటివి పునరావృతం కావనేది ఆమె ఆలోచన. అందుకే దశాబ్దం క్రితమే ఓ సామాజిక వేదిక ద్వారా ప్రభుత్వంపై ఒక పిటీషన్ వేసి ఆ దిశగా పోరాడు తోంది. విభిన్న ప్రతిభావంతులకు రైల్వే స్టేషన్లలో ప్రత్యేక సదుపాయాలు కలుగుతున్నాయంటే అందులో విరాలి కృషి చాలానే ఉంది. అందుకే ప్రత్యేక ఎస్కలేటర్లు, రైడింగ్ కార్‌లు, బోగీల్లోకి తేలిగ్గా ఎక్కేందుకు ర్యాంప్‌లు వీటన్నింటినీ ఇప్పుడు రైల్వేస్టేషన్లలో చూస్తున్నామంటే విరాలి పోరాటం తెలుస్తుంది.

విరాలికి 2006లో ఒక యాక్సిడెంట్ వల్ల రెండు కాళ్లు చచ్చుబడ్డాయి. అప్పటికి తన వయసు పదమూడేళ్లు. మోడల్‌గా, యాక్టర్‌గా మెరవాలన్న తన కల అక్కడే కొండెక్కింది. ప్రాణాపాయం తప్పినా కూతురు జీవితాంతం వీల్‌చెయిర్‌లోనే అనే విషయం తల్లిదండ్రుల గుండెల్ని మెలిపెట్టింది. ఈ ఘటన తర్వాత విరాలి తన ధైర్యాన్ని కోల్పోలేదు. 2014లో మిస్ వీల్‌చైర్ పోటీల్లో రన్నర్‌గా నిలిచింది. భారత్‌లోని వివిధ ప్రాంతాలతోపాటు విదేశాల్లోనూ యాత్రల్ని చేసొచ్చింది. ప్రస్తుతం ఓ ఎన్‌జివో సంస్థకి రచయిత్రిగా పనిచేస్తూ మోటివేషనల్ స్పీకర్‌గా పనిచేస్తోంది. విభిన్న ప్రతిభావంతుల హక్కుల కార్యకర్తగా పనిచేస్తోంది. 2008లో వైద్యం కోసం అమెరికాకు వెళ్లింది విరాలి. భారత్‌కి తిరిగి వచ్చిన విరాలితో ముంబయ్ స్టేషన్‌లో పోర్టర్ అసభ్యకరంగా ప్రవర్తించినా చుట్టూతా వున్న జనం నోరు మెదపకపోగా తన వంక జాలిగా చూడడం తనని కలచి వేసింది. ఆ తర్వాత పలు సందర్భాల్లో ఇలాంటి ఘటనలే పునరావృతం అయ్యాయి. ప్లాట్‌ఫామ్‌లపై వికలాంగ మహిళలు ఇలాంటి సమస్యలెన్నో ఎదుర్కొంటున్నారని తెలుసుకుంది. ర్యాంప్‌లు వుంటే ఇలాంటి చర్యలు పునరావృతం కావనే విషయాలని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. ప్రయాణాలంటే ఇష్టపడే విరాలి రైళ్లలో ఇరుకైన టాయిలెట్లని వినియోగించుకోలేక డైపర్‌లని వాడాల్సొచ్చేదని బెర్త్‌లు, టాయిలెట్లని పునరుద్ధరించాలంటూ ముంబై రైల్వే అధికారులకి ఫిర్యాదు చేసింది. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందనా లభించలేదు. ఈ విషయాలని ప్రస్తావిస్తూ ఛేంజ్‌డాట్ ఆర్గ్ ద్వారా ఒక పిటీషన్ వేసింది. ఇదంతా పదేళ్ల క్రితం జరిగింది. ఆ తర్వాత తన రచనల ద్వారా మహిళా వికలాంగుల సమస్యలని అందరికీ తెలిసేలా చేసింది. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలని తీసుకెళ్లడంతోపాటు 'సుగమయ్ భారత్ అభియాన్' పేరున అవగాహనా సదస్సులని నిర్వహించింది. వికలాంగులు తమ వీల్ చెయిర్‌లో కూర్చునేందుకు వీలుండేలా ట్రెయిన్‌లో సీటింగ్, పరిశుభ్రతతో కూడిన టాయిలెట్లు, వికలాంగ మహిళలు దుస్తులు మార్చుకునేందుకు వీలుగా బోగీల్లో కర్టెన్లని అమర్చాలని, సరైన ర్యాంప్‌లని అందుబాటులోకి తేవాలిన కోరుతూ ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి ఇటీవలే ఒక అర్జీని పంపింది. దాదాపు లక్షమంది మహిళా వికలాంగులు సంతకాలు సేకరించి వాళ్ళ కెదురైనా సమస్యలని తన ముందుంచారు. ఇవి మహిళా శిశుఅభివృద్ధి మంత్రిత్వ శాఖ అధికారుల దృష్టికి



వెళ్లడతంతో విరాలి పిటీషన్‌ని పరిగణనలోకి తీసుకోవాల్సిందిగా రైల్వే మంత్రిత్వ శాఖకు సిఫార్సు చేసింది. దీనిపై సానుకూల స్పందన లభించడంతోపాటు కొన్ని మెట్రో నగరాల్లో ర్యాంప్‌లని ఏర్పాటు చేశారు. తన పిటీషన్‌లో పేర్కొన్న సమస్యలన్నిటినీ త్వరలో పరిష్కరిస్తామంటూ భరోసాఇచ్చింది రైల్వేమంత్రిత్వ శాఖ. అయితే ఈ సమస్యలని ప్రధాని దృష్టికి తీసుకెళ్లడంతోపాటు మహిళా వికలాంగులకి పూర్తి న్యాయం జరిగే వరకు తన ప్రయత్నం ఆగదంటోంది విరాలి. ✦

వివరం................3
కోల్‌కతా ప్రయాణమిలా..!

స్టార్........4
అభిమాని మనసులో రెజీనా

నవ్వుల్ పువ్వుల్......... 5

వింత లోకం...........10
పాత ట్రింగ్‌లు..

విజేత............... 11
ట్రిలియన్ చెట్లు నాటాలి..!

కవిత్వమ్...............14
సుస్వాగతం హేవిళంబి

ఇండెక్స్

కవి కోకిల
కూసిన వేళ...

అట్టమీది కథ...6

నా కళ్లతో - 12
ఆఫ్రికాలో ఓ వైల్డ్ యాత్ర

తెలుసా...................15
తోకలు తగిలిస్తారట..!

కథ 16
ఇద్దరు మహిళలు

కొత్త పుస్తకాలు................20
అనంత కమ్యూనిస్టు యోధులు

రుచి.....................21
పుచ్చకాయ సోడా

బాల నేస్తాలు............23
బాటిల్ ఫ్లవర్‌వాజ్

పద వికాసం........24

వీళ్లు చెట్లని తరలిస్తారు

12-3-2016 ఆదివారం సంచికలో వీళ్లు చెట్లని తరలిస్తారు శీర్షికన వచ్చిన కథనం నన్ను అబ్బురపరిచింది. ప్రస్తుత కాలగమనంలో వృక్ష సంపదకి రక్షణ కరువైన విషయం అందరికీ విదితమే. గతంలో ఆశోక చక్రవర్తి, మరికొందరు రాజులు రహదారికిరువైపులా చెట్లని నాటించి వాటిని చక్కగా పెంచేవారు. దీని ద్వారా తమ ప్రాంతపు ప్రజలతోపాటు ప్రయాణాలు చేసే యాత్రికులకి నీడ కల్పించబడేది. కొన్ని ప్రభుత్వాలు వనమహోత్సవం కార్యక్రమం పేరున చెట్లను నాటించినా అది పూర్తిదశలో జరగలేదు. ప్రజాధనం దుర్వినియోగమవ్వకుండా చెట్లని తరలించే ఆలోచన అభినందనీయం. చెట్లు లేక మానవ మనుగడ ప్రమాదకరంగా మారుతున్న నేటి పరిస్థితుల్లో వృక్షాలని కాపాడాల్సిన బాధ్యత ప్రజలతోపాటు ప్రభుత్వానికి ఎంతైనా వుంది.

కై.ప నాగరాజు, అనంతపురం

టీమ్ ప్లానెటీర్స్ సూపర్

తన భార్యకు, కొడుక్కి ప్రాణాంతకమైనా ఎన్ని ఎదురు దెబ్బలు తగిలినా తన లక్ష్యాన్ని వదలక ఆపద్భంధవుడిగా టాక్సీ సేవలందిస్తున్న మెకానికల్ ఇంజనీరుకి హ్యాట్స్ ఆఫ్. ఇటువంటి వారు చాలా అరుదుగా కనిపిస్తారు. అంగారక గ్రహ వాతావరణాన్ని పోలిన రీసెర్చి స్టేషనులో శిక్షణ వివరణలు ఆసక్తిని కలిగించాయి. వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఓ చక్కటి హెల్త్ కేర్ ప్రికాషన్. పెరూ దేశపు రాజధాని లిమా నగర ప్రాంతంలో దట్టంగా అలుముకున్న పొగ మంచు నుంచి నీరును ఒడిసి పట్టే ఫాగ్ చేజింగ్ ప్రక్రియ ఓ వినూత్న అద్భుతం. చివరి అట్టపై శిథిల విడిది, రాతి ప్రాణుల చిత్రాల నుంచి దృష్టి మరల్చుకోలేము.

దీప్తికి అభినందనలు

'9.2-0, 20-6' ఈ క్రికెట్ లెక్క చాలు ఆ క్రికెట్ బౌలర్ స్టామినా ఏమిటో తెలుసుకునేందుకు. ఈ మ్యాజిక్ చేసింది భారత మహిళా క్రికెటర్ దీప్తి శర్మ అని తెలిసి గర్వపడ్డాం. నేటి యంగ్ హ్యాండ్సమ్ విలన్‌ల పరిచయం చదివించింది. మడ చెట్టు నాటి కేరళలో ఓ ప్రాంతంలో అడవినే సృష్టించిన కల్లెన్ మరో భగీరథుడే. నటిగా రాణిస్తున్న కార్తికాకి అభినందనలు. చైనాలో ఓ గుహ ప్రాంతం అందమైన గ్రామంగా రూపుదిద్దకోవడం విశేషంగా ఆకర్షించింది. మహిళా దినోత్సవం సందర్భంగా పరిచయం చేసిన మహిళల కథనాలు అద్భుతం. చివరి అట్టపై విచిత్రాలు వన్య వంతెనలు, కప్పాడాసియాను ఎయిర్ బెలూన్ల చిత్రాలు ఆ ఊరుని అందంగా తిలకింపజేసాయి.

-టి.సత్యనారాయన మూర్తి,
విశాఖపట్నం

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4,
ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

లండన్‌లో ట్యూబ్‌ను, బస్సును, పడవను ఇలా ఏ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌నైనా ఓ కార్డుతో వాడుకోవచ్చు. చిల్లర కష్టాలు, టికెట్ క్యూలైన్ బారుల వంటి కష్టాలకు చిల్లు కొట్టేసిందీ పాస్. వెంట వెంటనే బస్సులు మారే వీలూ ఉండటంతో వృథా మాట రాదు. ఎన్ని రకాల ప్రయాణాల్లైనా హాయిగా చేసేయొచ్చు. మరిలాంటిది మన దేశంలో ఉంటే చాలా బావుంటుంది కదూ. కోల్‌కతాలో ప్రయాణమిలానేనండి. ఓ స్మార్ట్ కార్డుతో, మరో స్మార్ట్ యాప్‌తో ప్రయాణం సునాయాసం, భద్రంగాను సాగిపోతోంది.

కోల్‌కతా ప్రయాణమిలా..!

పెద్ద నోట్ల రద్దు కావడంతో చిల్లర కష్టాలు ఎక్కువయ్యాయి. సామాన్యునికి తెల్లారితే బతుకు బండి నడిచేది దీని మీదుగానే. షాపులకు, ఆఫీసులకు, ఫ్యాక్టరీలకు, వ్యాపారాలకు ఇలా ఏదైనా ప్రయాణం ముందుంటుంది కదా. మహా నగరాల్లోనైతే మరీనూ. ఒక గ్రామం నుంచి పది గ్రామాల అవతల ఉన్న ఊరికి వెళ్లినట్టుంది. అనేక బస్సులు మారాలి. కోల్‌కతా వాసికైతే ఫెర్రీలూ మారాలి. లోకల్ ట్రైన్‌లు, ట్రామ్‌లు ఇలా లిస్ట్ చాలా దూరం పోతుంది. పబ్లిక్ ట్రాన్స్‌పోర్టే అయినా ప్రతి చోటా చిల్లర తప్పనిసరి కావడంతో నగరం నడక నెమ్మదించింది. అత్యధిక జనసాంద్రత కల నగరాల్లో సామాన్య ప్రజలపై ఈ ప్రభావం కాస్త ఎక్కువే. కానీ కొత్త ఆలోచనతో ప్రతి చోటా టికెట్ అవసరం లేకుండా ప్రయాణించేందుకు వీలుగా 'ఆల్ ఇన్ వన్ ట్రాన్స్‌పోర్ట్ కార్డ్' బానే పనిచేస్తోంది. దీనికి అదనంగా రాత్రి వేళల్లో... మహిళలపై దాడులని నివారించే 'పథదిశ' యాప్ వల్ల గొప్ప ప్రయోజనమే ఉంటోంది. తెలుపు, లేత నీలిరంగు మేళవింపుతో రూపుదిద్దుకున్న ఈ కార్డ్‌పై 'వెస్ట్‌బెంగాల్ ట్రాన్స్‌పోర్ట్' అని ముద్రించబడి వుంటుంది. ఈ కార్డ్ ద్వారా రోడ్డు ప్రయాణాలే కాదు కొన్ని ఫెర్రీ మార్గాల్లో బోటు ప్రయాణాలతోపాటు ట్రెయిన్ ప్రయాణాలని చేసే వీలుంది. ప్రస్తుతం మెట్రో వాహనాల్లో ఈ కార్డులని అనుమతించడంలేదు. మెట్రో వాహనాలు కేంద్ర

ప్రభుత్వం ఆధీనంలో నడపబడటం కారణం. ఈ కార్డులని ముందుగా వెయ్యి రూపాయలు చెల్లించి కొనుగోలు చేయాల్సి వుంటుంది. మనం ఎక్కే వాహనాల్లో కార్డ్‌ని స్వైప్ చేయడం ద్వారా ప్రయాణించే దూరాన్ని బట్టి డబ్బు చెల్లింపులు కార్డ్ ద్వారా జరుగుతాయి. ప్రయాణ అవసరాన్ని బట్టి ఈ 'ఆల్ ఇన్ వన్ ట్రావెల్ కార్డ్'ని రీచార్జ్ చేసుకుంటే సరిపోతుంది. కోల్‌కతాలోని వివిధ రవాణా వాహనాల్లో చిల్లర తిరిగివ్వడంలో ప్రయాణీకులకు అసౌకర్యం లేకుండా వుండేందుకు ఈ ఆలోచనని అమలు పరిచారు. నగదు లేకుండా కొనసాగుతున్న ఈ ప్రయాణాల ద్వారా సమయం కూడా పొదుపు చేసుకోవచ్చు. ఈ విధానాన్ని మొట్టమొదట ఏడు వందల బస్సుల్లో ప్రవేశ పెట్టారు. పాత ఖాకీ రంగు యూనిఫామ్‌లకి బదులుగా ఈ బస్సుల్లో డ్రైవర్, కండక్టర్‌లు 'సేఫ్ డ్రైవ్, సేవ్ లైఫ్' అని రాసుండే ముదురు నీలిరంగు దుస్తుల్లో కనిపిస్తారు. కోల్‌కతాలోని ఐదు ప్రధాన బస్ స్టేషన్లతో ఈ కార్డుల విక్రయాలు అందుబాటులో వుంచారు. త్వరలో మరో 20 ప్రాంతాల్లో వీటి అమ్మకాలని జరపడంతో పాటు మరో మూడు వందల బస్సుల్లోనూ ఈ కార్డులని ఉపయోగంలోకి తేనున్నారు. స్మార్ట్ ఫోన్ వినియోగదారులు 'పథ దిశ' యాప్‌ని డౌన్‌లోడ్ చేసుకోవడం ద్వారా పూర్తి భద్రత పొందే అవకాశం వుందంటున్నారు రవాణా అధికారులు. యాప్‌లోని జీపీఎస్ సిస్టమ్ ద్వారా మనం ప్రయాణించవలసిన బస్సు బయల్దేరే సమయంతోపాటు ఎంతమంది ప్రయాణిస్తున్నారు, ఏ మార్గంలో బస్సు ప్రయాణిస్తోందనే సమాచారాన్ని తెలుసుకోవచ్చు. కార్డు అనుమతించబడే ఈ బస్సుల్లో జీపీఎస్, సిసిటివిలు అమర్చబడి వుంటాయి. బస్సులో ప్రమాదకర పరిస్థితుల్లో మహిళలు సాయం



పొందేందుకు పానిక్ బటన్‌ని అందుబాటులో వుంచారు. యాక్సిడెంట్ సందర్భంలో ప్రయాణీకులకి త్వరిత గతిన వైద్యం అందించేందుకు సమాచారాన్ని వెంటనే దగ్గరలోని పోలీస్, ఫైర్ స్టేషన్‌లతోపాటు వైద్యులు స్వచ్ఛంద సంస్థలకు సమాచారం అందుతుంది. కొరియాకి చెందిన గ్రీన్ గ్రోత్ ఫండ్ సౌజన్యంతో వచ్చిన ఈ సదుపాయం ఇప్పటికే అత్యధిక జనసాంద్రత గల శ్రీలంక వంటి దేశాల్లో అమల్లో వుంది. మరో ఆరు నెలల్లో కోల్‌కతాలోని అన్ని ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో ఈ యాప్, కార్డ్ సదుపాయాలుని అందుబాటులోకి రానున్నాయి. వీటిని త్వరలో ప్రయివేట్ వాహనాల్లోనూ అమలు చేసేందుకు రవాణా సంస్థ కృషిచేస్తోంది. ✦

స్టార్

హీరోయిన్ అంటే ఎప్పటికీ పదహారేళ్లే అనే మైండ్‌సెట్‌ను తన ఎంట్రీతోనే బ్రేక్ చేసింది రెజీనా కసాండ్రా. 14 ఏళ్లకు 21 ఏళ్ల గర్భవతిగా డీ-గ్లామ్ పాత్రలో చిత్ర సీమకు పరిచయమైంది. ఇప్పుడు గ్లామర్ పాత్రల్లో ఎక్కువగా నటిస్తున్నా కాస్త ప్రత్యేకంగా కనిపిస్తుంది.. హావభావాలు, నటనతీరులో. అలా నటిగా సర్‌వైవ్ అయ్యేందుకు ప్రయత్నిస్తోంది. దక్షిణాది స్టార్‌గా ఈపాటికే పాపులర్ అయిపోయింది. ఒకప్పుడు రెండు చిత్రాల తర్వాత ఖాళీలో డిగ్రీ పూర్తి చేసింది. కానీ ఇప్పుడు ఖాళీ అనేదే లేనంతగా తెలుగు, తమిళ చిత్రాల్లో అవకాశాల వెల్లువలో వెలిగిపోతోందీ తార. 'ఎస్ఎంఎస్' 'శివ మనసులో శృతి' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పినా రెజీన 'నక్షత్రం'తో మరింత తళుకులీననుంది.

అభిమాని మనసులో రెజీనా

చెన్నైలో పుట్టి పెరిగింది రెజీనా. తల్లి తమిళ్ అయితే తండ్రి ఉత్తరాదికి చెందినవ్యక్తి. బామ్మేమో గోవాకు చెందిన ఆంగ్లో-ఇండియన్, తాతేమో క్రిస్టియానిటీలోకి మారిన అయ్యంగార్. అందుకే రెజీనా ఇంగ్లిష్‌తోనే తేలిగ్గా ఉండగలదు.

- తొమ్మిదేళ్లపుడే 'స్నాష్' అనే పిల్లల చానెల్‌లో యాంకర్‌గా మెప్పించింది. దూరదర్శన్‌లోను ఓ టీవీ కార్యక్రమంలో చేసినా అది ఒక్క ఎపిసోడ్‌తోనే ఆగిపోయింది.
- చిన్నప్పుడు బాగా హైపర్ యాక్టివ్‌గా ఉండటంతో వేసవి సెలవుల్లో నటిస్తూ, మామూలు రోజుల్లో భరతనాట్యం నేర్చుకుంటూ గడిపేసేది. బ్రేక్‌లో టీవీ షో సెట్ల మీద కూడా పుస్తకాలు తిరగేస్తూ కనిపించేది.
- ఆ తర్వాత కొన్ని కమర్షియల్స్‌లో నటించిన రెజీనా 14 ఏళ్ల వయసులో వెండితెరకెక్కింది. అది కూడా బరువైన 21 ఏళ్ల గర్భిణి పాత్రలో.
- 2005లో వి.ప్రియ దర్శకత్వం వహించిన 'కాంద నాల్ ముదల్' అనే చిత్రంలో లైలాకు సోదరిగా నటించింది. ఎటువంటి మేకప్ లేకుండా నటించి పాత్రకు ప్రాణం పోసింది.
- ఆ తర్వాత 'అళగియ అసుర'లో యోగితో కలసి నటించింది. ఈ చిత్రానికి పెద్ద స్పందనేమి రాకపోవడంతో మళ్లీ చదువు కొనసాగించింది.
- చెన్నైలోని వుమెన్స్ క్రిస్టియన్ కాలేజీలో సైకాలజీ విద్యను అభ్యసించింది.
- ఈ సమయంలోనే అనేక షార్ట్‌ఫిల్మ్‌ల్లో నటిస్తూ పేరు సంపాదించింది. బాలాజీ మోహన్ షార్ట్‌ఫిల్మ్ 'కాదలిల్ సొదప్పువదు యెప్పడి'లో నటించడంతో క్రేజ్ వచ్చింది. అదే లఘుచిత్రాన్ని ఆ తర్వాత 2012లో 'లవ్ ఫెయిల్యూర్' సినిమాగా తీశారు.
- ఈ చిత్రమే కన్నడ సినిమాలో అవకాశాన్నిచ్చింది. 'సూర్యకాంతి'తో కన్నడ ప్రేక్షకులకు పరిచయమైంది. సినిమా విజయవంత మవడంతో అవకాశాలు పెరుగుతాయనుకుంది.
- తమిళ చిత్రం 'మాలై పొళుదిన్ మాయాకతిలై'లో అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారింది అప్పుడే.
- ఈ చిత్రంలో నటించకున్నా తెలుగు చిత్ర సీమలో వెలిగేందుకు అవకాశం వచ్చింది. 'శివ మనసులో శృతి' (ఎస్ఎంఎస్) చిత్రం ద్వారా హీరోగా సుధీర్ బాబు ఎంట్రీ ఇస్తే తెలుగు సినిమా అభిమానులకు కొత్త హీరోయిన్‌గా రెజీనా పరిచయమైంది.
- ఆ వెంటనే 'రొటీన్ లవ్ స్టోరీ'లోను సందీప్ కిషన్‌తో నటించింది. 'ఎస్ఎంఎస్' విడుదల కాకముందే ఈ ప్రాజెక్ట్‌లో అవకాశం దక్కింది. 'ఎస్ఎంఎస్'లో అవకాశం వచ్చినపుడే శేఖర్ కమ్ముల 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్'లోను ఆఫర్ వచ్చింది కానీ లీడ్ రోల్ కోసం వదులుకుంది.
- 2013లో తమిళ చిత్రాలు 'కేడీ బిల్లా ఖిలాడీ రంగా', 'నిర్ణయమ్'తో అక్కడ అవకాశాలు పెరిగినా తెలుగు తెరకే అంకితమైంది.
- అలా 2014లో వచ్చిన 'కొత్త జంట' రెజీనాను స్టార్‌ను చేసేసింది.
- తర్వాతి చిత్రాలు 'రారా కృష్ణయ్య', 'పవర్', 'పిల్లా నువ్వు లేని జీవితం', 'సుబ్రహ్మణ్యం ఫర్ సేల్' వంటి చిత్రాలు కెరీర్‌కు మంచి ఊపునిచ్చాయి.
- వరసగా మూడేళ్లలో 14 సినిమాల్లో నటించి స్టార్ హీరోయిన్‌గా చలామణీ అవుతోంది.
- ప్రస్తుతం కృష్ణవంశీ తీస్తున్న 'నక్షత్రం'లో కీలక పాత్ర పోషిస్తోంది. ఇందులో ఆమె పాత్ర డిఫెరెంట్ లుక్‌లో ఉండబోతోందని పోస్టర్ ద్వారా తెలుస్తోంది.
- అమితాబ్ బచ్చన్ నటిస్తోన్న 'ఆంఖే-2'లో రెజీనాకు అవకాశం వచ్చింది. అనిల్ కపూర్, అర్షద్ వార్సి, అర్జున్ రామ్‌పాల్ వంటి దిగ్గజాలున్న ఈ సినిమా ఆమెకు బాలీవుడ్‌లో సూపర్ ఎంట్రీగా మారనుంది.
- 'పెటా'కు చెందిన ఓ ఆర్టికల్ చదివి శాఖాహారిగా మారిపోయింది. కాఫీ, పన్నీర్‌తో పాటు రొమాంటిక్ నవలలు చదవడం ఇష్టాలు. అవి కూడా ఆన్‌లైన్‌లో అప్పుడే రచయితగా మారినవారివి. పూలు, బొమ్మలు అంటే అస్సలు ఇష్టముండదట.
- 'ద షో మస్ట్ గో ఆన్' అనేది ఆమెకిష్టమైన పదం. చూస్తుంటే ఆమె కెరీర్ స్పీడ్‌కు బ్రేక్‌లు పడేలా లేవు. ఆమె షో నడుస్తూనే ఉంటుంది.

✦

నవ్వుల్ - పువ్వుల్

పొదుపు



బంటి : మా నాన్న వట్టి పిసినారి తెలుసా...

చింటు : ఎలా చెప్పగలవు?

బంటి : మొన్న మా చెల్లి ఐదు రూపాయల కాయిన్ మింగితే ఆపరేషన్ చేయించి మరీ తీయించాడు తెలుసా?? అసలు విషయం చెప్పాడు....

గురి తప్పింది

గత మూడేళ్ళుగా మా ఆవిడ నా మీద చాకు విసురుతోందండీ..! కోర్టులో వాపోయాడు అప్పారావు.

జడ్జి : మూడేళ్ల నుంచి విసురుతుంటే ఇప్పుడెందుకు కోర్టుకు వచ్చావయ్యా??

అప్పారావు : గత మూడు రోజుల నుంచే గురి తప్పకుండా చాకు విసరడం అలవాటైపోయింది సార్..! అసలు విషయం చెప్పాడు అప్పారావు.

తికమక

సుబ్బారావు : నెత్తిన జుట్టు అంతలా పెరిగింది ట్రిమ్ చేయించుకోవచ్చు కదరా....

చంటి : ఇది లేటెస్ట్ ఫ్యాషన్

సుబ్బారావు : ఇవాళ్ల నీ చెల్లి పెళ్లిచూపులకి వచ్చిన అబ్బాయికి నువ్వు నచ్చావంటరా వెధవా....

కిసుక్కు

భార్య : నేను రోజూ ఇలా కమ్మగా వండి పెడితే నాకేమిస్తారు?!

భర్త : ఇలా గనక నువ్వు రోజూ వండితే కొన్నాళ్లకు నా ఇన్సూరెన్స్ సొమ్ము నీకే వస్తుంది!...

ప్లేస్కూల్

తండ్రి : ఏరా స్కూల్ నుంచి లేటుగా ఎందుకు వచ్చావ్? (కోపంగా అడిగాడు).

కొడుకు : టీచర్ నిద్రపోయారు డాడీ

తండ్రి : ఆయన పడుకుంటే నువ్వు రావడానికేమైంది?

కొడుకు : ఆయన లేస్తేనే కదా మమ్మల్ని లేపేది...

నాన్న పేరు

టీచర్: పిల్లలూ అందరూ మీ పేరు మీ నాన్న పేరూ రాయండి.

చింటు: అయిపోయింది టీచర్...

టీచర్: ఇంత త్వరగానా .....ఏదీ నీ బుక్ చూపించు....అదేంటి నీ పేరు అడ్డంగా మీ నాన్న పేరు నిలువుగా రాశావ్.

చింటు: ఎక్కడికెళ్లినా తన పేరుని నిలబెట్టాలని మా నాన్న చెప్పారు... అందుకే....

కిసుక్కు సిత్రం



ఉండమ్మా ముద్దు పెడతా..!

నాకు నచ్చిన చిత్రం ఇల్లస్ట్రేటర్ : రఫెల్ ఆల్వారెజ్

సేకర్త - పి. బాలు, గుణదల

కవి కోకిల కూసిన వేళ..



కాలం- ఇలా కలగాపులగం కానప్పుడు... రుతువులన్నీ గతి తప్పకుండా నడిచినప్పుడు... జీవవైవిధ్యం ప్రకృతితుల్యంగా అలరారినప్పుడు... పర్యావరణం కాలుష్యమయం కాకుండా ఉన్నప్పుడు - ఉగాది ఉగాదిలా వచ్చేది. వస్తూ వస్తూ ప్రకృతి ఒంటి నిండా పచ్చని చీర చుట్టేది. శిశిరం శివాలుకు చెట్లన్నీ ఆకులు రాల్చితే - ఆ బోడి కొమ్మలకు పచ్చని గుబురు కిరీటాలు పెట్టేది. లేలేత ఆకుల మధ్యలోంచి చల్లని గాలిని షికారుకు పంపేది. మామిడి కొమ్మలకు కాయల గుత్తులు కట్టేది. వేపచెట్టు నిండా పాలపుంతలాంటి పూల పొట్లాలు తొడిగేది. ఆ సన్నాహాలకు ప్రకృతి సైతం పరవశిస్తూ ఉండేది. పక్వానికి వచ్చిన చెరకు గడ ఏడడుగుల ధనుస్సులా వొంగి చూసేది. చింతతోపుల నిండా పులుపు కంకణాలు పొటమరించి ఉండేవి. మల్లి, సంపెంగ, సన్నజాజి, మందారం, మరువం వంటి పూలమొక్కలన్నీ తలనిండుగా పూలను దాల్చి - గాలిని సువాసనాభరితం చేసేవి. అలాంటి కనువిందు నేపథ్యంలో గుబురు మామిడిచెట్టు మీద వగరు చివుళ్లు తింటూ- కోకిల 'కూహూ కూహూ' రాగాలు తీసేది! ఇది ప్రకృతిలోంచి ప్రకృతిని మేల్కొలిపే ఒక ఉగాది ఆగమన సన్నివేశం. మనిషిలో మధురోహలకు మెట్లు కట్టే సందర్భం. అది వసంతోత్సవ వైభవం.

\- సత్యాజీ

9490099167

అదిగో, తొలి కవి గానం!

ఆ ప్రకృతి పరవశానికి ఓ యువకుడు ఎక్కడో గొంతెత్తుతాడు. ఏ నీలాటి రేవు కాడో ఓ నవ జవ్వని కిసుక్కున నవ్వుతూంది. ఊహలతో మాటలు పోటెత్తుతాయి. మాటల్లో ఊహలు ఉవ్విళ్లూరతాయి. ప్రకృతిలోని పరిణామాల క్రమం మనసు మూలల్లో పదాల మాలలు కడుతుంది. నెమ్మదిగా ఒక రూపు కట్టుకున్నాక- చిన్న లయబద్ధ గేయమై గుండెలోంచి బయటకు ఉరుకుతుంది. అలా సాధన చేసి చేసీ- ఒకడు కవిగా అవతరిస్తాడు. ఓ సాయంకాలపు సంధ్య వేళ... ఏ నదీ తీరానో, ఏ వటవృక్ష ఛాయలోనో పదాలతో పరిమళిస్తూ ఉంటాడు. అటు ఆకులందున అణిగిమనిగి కోయిల గానం చేస్తూ ఉంటుంది. ఇటు ప్రకృతి ఒడిలో పరవశిస్తూ కవి కోయిల గొంతెత్తి పాడుతోంది. అదే ఉగాది తొలి కవితా గానం. పల్లెపదాల మల్లెల గుబాళింపుతోనే తొలుత ఉగాది కవిత పుట్టి ఉంటుంది! సందేహం లేదు. సంస్కృతంలో ఉద్ధండ పండితుల వసంత రుతువర్ణన జరగటానికి ముందు జానపదుడెవడో జావళిలా పాడి ఉంటాడు.. న్నిజం!

ఉగాది... కవిత్వానికి ఆది

ఉగాదికీ, కవిత్వానికీ ఉన్న సంబంధం యుగాది అంత పాతది. వసంత రుతు వేళల్లో కోయిల కుహూ కుహూలు ఎంత సహజమో- కవి కోకిల కవితా గానమూ అంతే సహజం. ఈరోజు అనేక మార్పులు వచ్చేశాయి. పొలాలు ఇళ్ల సముదాయాలుగా మారిపోయాయి. చెట్లు నేలమట్టం అయిపోయాయి. అంతస్తుల మీద అంతస్తులుగా అపార్టుమెంట్లు వెలిశాయి. కాలుష్యం చేరని చోటంటూ లేకుండా పోయింది. కాలాలు గతి తప్పాయి. రావాల్సి ఉన్నప్పుడు వానలు రావటం లేదు. రాకూడని సమయంలో వస్తే- పొమ్మన్నా పోవటం లేదు. చలి తీవ్రంగా వణికించి చంపేస్తోంది. బండలు పగిలేలా ఎండలు అదరగొడుతున్నాయి. బతుకులు మునిగిపోయేలా వానలూ, వరదలూ ముంచెత్తుతున్నాయి. కాలం ఇలా క్రమం తప్పినా- ఉగాది మాత్రం క్యాలెండరు ప్రకారం వచ్చేస్తోంది. కానీ, ఒకప్పటిలాంటి శోభ మాత్రం వెంట రాదు. పల్లె వాతావరణం, వన సముదాయమూ దూరమైన అత్యధిక శాతం జనానికి కోయిల కూహూకూహూలు కూడా వినిపించవు. కానీ, పల్లె నుంచి మహానగరం దాకా వినిపించే ఒకే ఒక స్వరం కవిది. ఉగాది కవిది.

ఉగాది కవుల మీద బోలెడన్ని హాస్యాలూ పరిహాస్యాలూ ఉన్నాయి. ఫిర్యాదులూ ఫితూరీలూ



ఉన్నాయి. 'అదిగో వస్తున్నాడు.. పారిపోదాం పదండి..' అని తోటి కార్టూనిస్టులే కవిని కానివాణ్ణి చేసిన సందర్భాలున్నాయి. ఇటు ఉగాది కవి కవితలతోటి, అటు అర్థాంగి సొంతంగా చేసిన ఉగాది పచ్చడితోటీ వస్తుంటే- ఎటూ పారిపోలేని వెర్రి వెంగళప్ప కార్టూను కూడా మనల్ని నవ్విస్తూ ఉంటుంది. అయితే, ఉగాది కవులది, కవి సమ్మేళనాలదీ ఆసాంతం ఇలాంటి నవ్వులాట సంరంభమే కాదు. కవిత్వంతో బోలెడు దర్జాలూ, పద్యాలతో బోలెడు మేథో వికాస పర్వాలూ వెలయించిన ఏళ్ల తరబడిన చరిత్ర వారిది! ఒకప్పుడు వసంతోత్సవం వచ్చిందంటే- యువతీ యువకుల సల్లాప వేడుకలు ఒక ఎత్తు. పండిత పామరుల మధ్య కవుల కవితాగానం మరొక ఎత్తు. తొలినాళ్లలో ఉగాది కవిత్వం వసంత ఉత్సవాల వర్ణనకూ, ప్రకృతి పారవశ్యాల వివరణకే పరిమితం. ఏతెంచిన తెలుగు సంవత్సరం ఏమిటో తెలుసుకుని- ఆ నామ లక్షణం మీద లంఘించటం కవి బెబ్బులులకు సహజ కృత్యంగా ఉంటుంది. ప్రభవో, విభవో రాగానే ప్రకృతి అంతా పరవశించిపోతుందని, ఆ ప్రకృతిలాగానే జనమూ ఆనందోత్సాహాలతో ఉప్పొంగిపోతున్నారని, ఏడాది మొత్తం ఇలాగే అలరారిపోవాలనీ- కవిత్వాన్ని అదరగొట్టేవారు. సంస్థానాల కాలం వరకూ అలాంటి కవిత్వం బాగానే వర్థిల్లింది. దర్బారులోని కొద్దిమంది సెహబాసులూ, ప్రభువులు ఇచ్చే నజరానాలూ ఆశ్రిత కవులకు ఆనందం నింపేవి. అలాంటి చోట కవిసమ్మేళనాల్లో పాల్గొనటం అందరికీ సాధ్యం కానిదే!

ఉగాది కవిత్వంలో ప్రజాహితం

ప్రజాస్వామ్య కాలంలోనూ కొంత అలాంటి ఒరవడే సాగింది. ఆకాశవాణి వంటి సంస్థలు చాలాకాలం రాజ దర్బారు పాత్రనే పోషించాయి. ఒకప్పుడు ఆకాశవాణి ఉగాది కవిసమ్మేళనమంటేనే ఒక ప్రత్యేకం. ఉగాది వేళ ఉదయం పంచాంగం విన్నంత శ్రద్ధగానే ఆ తరువాత రేడియో కవిసమ్మేళనాన్నీ వినేవారు. కవుల స్వరంలో కూడా నెమ్మది నెమ్మదిగా మార్పు వచ్చింది. ప్రభుత్వాలను నేరుగా విమర్శించటం ఉండేది కాదు కానీ, ప్రభుత్వ పథకాల ద్వారా పేదరికం పోవాలని, ఉగ్రవాదం, వేర్పాటువాదం నశించాలనీ; యుద్ధకాంక్ష పోయి ప్రపంచశాంతి వర్థిల్లాలనీ కవిత్వంలో అభిలషించే ధోరణి పెరిగింది.

1930 తరువాత తెలుగునాట అభ్యుదయ ఆలోచనలు పురివిప్పాయి. 'కళ అయినా, కవిత్వం అయినా మానసికోల్లాసం కోసం కాదు; ప్రజల కోసం, సమాజం కోసం...' అనే భావనలు వేగంగా వ్యాపించాయి. సాంప్రదాయ కవిత్వం స్థానే ఇది కొత్త మార్పు. కొంగొత్త ఆలోచనల కూర్పు. అనేకమంది యువకవులు తెలుగునాట వెలుగు రేఖల్లా దూసుకొచ్చారు. అభ్యుదయానికి తెరచాపలెత్తారు. ఉగాది కవిత్వం అంటే రుతువుల వర్ణనో, రుచుల చర్విత చర్వణమో కాదని తేల్చి చెప్పారు. కమ్యూనిస్టులు ఈ కొత్త గొంతులకు వేదికలను ఏర్పరిచారు. పెద్దఎత్తున కవిసమ్మేళనాలు నిర్వహించారు. తాము చూస్తున్న, అనుభవిస్తున్న బాధల గురించి; ఆవేదనల గురించి తమదైన తేలికైన భాషలో ఎలా గొంతెత్తవచ్చో ఈ నవకవులు చాటిచెప్పారు. పండితులకే పరిమితమైన పద్యకవిత్వాన్ని వదలిపెట్టారు. సాధారణ ప్రజలకు కూడా అర్థమయ్యే భాషలో వచన కవిత్వాన్ని ఉగాది కవిసమ్మేళనాల్లో వినిపించారు. యతులు, ప్రాసలు, సీసపద్యాలూ వెనకపట్టు పట్టాయి. ఆకాశవాణి ఉగాది కవి సమ్మేళనాల్లో శ్రీశ్రీ, ఆరుద్ర, డాక్టర్ సి నారాయణరెడ్డి, దాశరథి వంటి వారు ప్రజల దైనందిన సమస్యలను కవిత్వం చేసి, వినిపించారు. తెలుగునాట ఉగాది కవిసమ్మేళనాల్లో సామాన్యుల వెతలూ బతుకులూ చోటుచేసుకోవడం ఆవిధంగా ప్రారంభమైంది. ఉగాది పచ్చడిలో తీపి ఒక్కటే

సినీగీతాల్లో ఉగాది తలపులు

ఉగాది అంటేనే - కోయిల పాటలు, కుహూకుహూ గారాలు. ఏ కావ్యమైనా వీటి ప్రస్తావన లేకుండా సాగదు. ఇదొక అనాది ఆనవాయితీ! చిగుళ్లనూ కోయిలనూ కలిపి పోతనామాత్యుడు భాగవతంలో 'మందార మకరంద మాధుర్యమునదేలు కోయిల చేరునే కుటజములకు' అని పద్యం కట్టాడు. కృష్ణశాస్త్రి గారి పాటల్లోనైతే ఎప్పుడూ చిగుళ్లు కోయిలలు, సెలయేళ్లు వంటివి పలకరిస్తూనే ఉంటాయి. 'మావిచిగురు తినగానే కోయిల పలికేనా... కోయిల గొంతు వినగానే మావి చిగురు తొడిగేనా' అని ప్రశ్నిస్తాడు. 'చిగురాకుల వూయలలో ఇల మరిచిన ఓ చిలుకా' అనేది ఎప్పటిదో పాత పాట. 'చిగురులు వేసిన కలలన్నీ తలలో పూలుగా మారినవి' అని పూలరంగడు పాట మోహన్‌దాస్ గొంతులో అలా నిలిచిపోయింది. 'చింతచెట్టు చిగురు చూడు, చిన్నదాని పొగరు చూడు' అన్న అదృష్టవంతులు పాట జానపద బాణీలో పెద్ద హిట్టయి కూచుంది. 'చిగురేసే మొగ్గేసే సొగసంత పూత పూసే.. చెయ్యియినా వెయ్యవేమీ ఓ బాబూ దొర' అనే పాట కూడా చిగురుతో ముడిపడిందే! చిగురునూ వలపునూ కలిపి పాటలల్లడం మన సినీ కవులకు రివాజు.



కాదు; చేదు, పులుపు, వగరూ ఉన్నట్టే- ఉగాది కవిత్వంలో అన్ని జీవన పార్శ్వాలూ పల్లవించటం మొదలైంది.

కవిత్వానికి ప్రేరణ ప్రకృతి



ఇక ఆధునిక కవి అయినా, సాంప్రదాయక కవి అయినా ఉగాదిని పరామర్శించకుండా సాగటం కష్టమే! ప్రకృతిలోని వైవిధ్యం, వైరుధ్యం ఉగాది వేళ మరింత స్పష్టంగా కనిపిస్తుంది. ఆరురుచుల ఉగాది పచ్చడి కూడా అన్ని జీవన కోణాలనూ ప్రతిబింబిస్తుంది. ఈ విభిన్నతే కవిత్వానికి కచ్చితమైన ప్రేరణ. జీవితాన ఎవరికి ఎంత తీపి దక్కుతుంది? చేదు ఎంత మిగుతుంది? పులుపు మలుపులు ఎన్ని? అసలు వీటన్నింటికీ కారణం ఎవరు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలను అన్వేషించే కవి అంతస్సంఘర్షణే కవిత్వమై వెలుగుతుంది. ఉగాది వేళ దాదాపు అన్ని పట్టణాలు, చాలా మండల కేంద్రాల్లో కూడా కవిసమ్మేళనాలు జరుగుతాయి. వందల ఏళ్ల క్రితంలాగానే ఇప్పటికీ ఉగాదికి స్వాగత వచనాలు పలికే కవులు ఉన్నారు. అలాగే 'ఉగాది ఉత్సవవేళ ఇదిగో ఇలా ఉంది సామాన్యుడి బతుకు గోల' అని వినిపించే కవులూ ఉన్నారు. ఒకవిధమై కవితోత్సవ వాతావరణం ఉండడంవల్ల చాలా మంది కొత్త కవులు ఉగాది సమ్మేళనాల్లోనే పుట్టుకొస్తారు. తెలుగు ఉగాది సృజనకర్తలకు ఇలా పునాది అవుతుందన్న మాట! అయితే, ఉగాదికి పుట్టిన కవి ఉగాదికే పరిమితం కాకూడదు. 'కవి వట్టి వసంత కోయిల కాదు; ఏడాదికొకసారి వచ్చి పోవటానికి.. కవి మట్టి మనుషులకు తోవ చూపే అక్షర జ్వాల.'

వెడలిపోతున్న ఏడాదికి
మంచుపూల మాల వేసి
వీడ్కోలు చెపుతున్నాము
చేరవస్తున్న సంవత్సరానికి
వెచ్చని ఆశల గుచ్ఛం అందించి
స్వాగతం పలుకుతున్నాను
కాలం ఏ కాలంలో పుట్టిందో
తెలుసుకొనే కాలం
కనుచూపుమేరల్లో ఉన్నట్టు కలలు
కంటున్నాను

....

గున్న మామిడి చెట్టు లాగ
నాగుండె గుబాళిస్తున్నది
ఉగాది పచ్చడిలాగ
సమైక్యత రుచిస్తున్నది

....

హాసంతో వచ్చి
మోసం చేసిపోతున్న
ఈ కామరూపక కాలపాలకులను
ఇక నమ్మను
మారుతున్నట్టే మారి
మళ్ళీ మొదటికి వచ్చే
ఈ ఋతు చక్రధారులను నమ్మను
మాయలు
చేసే వాళ్ళు మారడం లేదు
చూసే వాళ్ళు మారుతున్నారు

....

పాత చింతకాయ పచ్చడికి
కొత్త తలకాయ ఊగుతూంది
చర్విత చర్వణమైన చరిత్ర
సగర్వంగా సాగిపోతూంది

....

కుతంత్రాల కొండల మీద
కుమిలిపోతున్న కాశ్మీరమా
కష్టాల కడలి ఒడిలో
కలవరిస్తున్న కన్యాకుమారి
అనుమానాల అడవుల్లో
అసహాయతల లోయల్లో
అలమటించే భారతీ
ఈ ఉష్ణరక్త వాసంతంలో
నవయుగ గీతి ఆలపించు !
విప్లవ జ్యోతి వెలిగించు !

....

అదుగో !
ప్రజాశక్తి పల్లవిగా
ప్రగతిగేయాలు పాడుతున్నాయి
పరభృతాలు
కాలం కన్నుల్లో
ఆశాఫలాలశ దీపాలు వెలిగించి
రాలిపోతున్నాయి

కవిత్వంలో జీవన స్వరాలు

కవి చండశాసనుడు అన్నారు. రవి కాంచని చోటు కూడా కవి కాంచును అని కూడా అన్నారు. కాబట్టి- కవి ఉగాది సమ్మేళనంలో వినిపించని అంశం అంటూ ఏమీ ఉండదు. దారి తప్పితే తోటి కవిని కూడా నిరసిస్తాడు. నిలదీస్తాడు.

"ఉగాదికి ఊరంతా కవి సమ్మేళనాల వాసనే!
కంఠాలు తెగిన కోయిలల చేత
కమ్మగా పాడించాలని కవుల ప్రయత్నం...
ఆయువు తీరిన వసంతానికి పద్యాల
పూలజడలు అల్లుతున్నారు
చేదును మాత్రం మిగుల్చుకున్న ఉగాది
పచ్చడికి
రుచీ, వాసనా లేని మాటల తలపాగా
చుడుతున్నారు.."

నేటి సామాజిక వాస్తవాలను చూడలేనివారి మీద ఇది కవి ఫిర్యాదు. ఇంకా పాత పద్ధతులనే పట్టి వేలాడకండి.. రండి.. వాస్తవంలోకి.. అని కవి పిలుపు. అసలు ఉగాది పేరిట జరిగే హంగామాను సైతం అదే ఉగాది కవి సమ్మేళనం వేదిక మీద నుంచి ప్రశ్నిస్తాడు మరో కవి.

" భూతకాలం పెరిగినట్టా
భావికాలం తరిగినట్టా
కొత్త సంవత్సరం రావటం అంటే
ఏమిటి జరిగినట్టు?
సూక్ష్మాతిసూక్ష్మమైన తన కేంద్ర బిందువు
నుంచి
సమానాంతరం పాటిస్తూ
నిరంతర సంక్రమణం సాగిస్తున్న
పరిధి పరమావధి ఏమిటి?"

ఈ ప్రశ్నకు జవాబు చెప్పటం కష్టమే! కానీ, చెప్పుకోవడం అవసరం. కాలం నిరంతరం ప్రవహిస్తూనే ఉంటుంది. భూమి తన చుట్టూ తాను పరిభ్రమిస్తూనే ఉంది. కాలం ఒక సౌలభ్య విభజన. అంతే! జీవితం ఒకటే వాస్తవం. దాని గురించి ఆలోచిద్దాం అంటాడు కవి.

ఉగాది కవిత్వం ఎన్నో జీవిత సత్యాలను చెబుతుంది. ఒక్కోసారి వర్తమాన రాజకీయాల డొల్లతనాన్ని కూడా నిలేసి, ప్రశ్నిస్తుంది.

"కొరడాలు విసిరితే కోకిలలు కూయవు
కత్తులు ఝుళిపిస్తే కొమ్మలు విరబూయవు
కొత్త ఆలోచనల కోకిల నా హృదయం
కొత్త అనుభూతుల కొమ్మ నా ఆత్మ





ప్రగతి పల్లవాలు పల్లవిగా పాడుకోనీయండి దాన్ని
ఆనంద చేతనం కేతనంగా ఆడుకోనీయండి దాన్ని."
" ప్రతి చెట్టుకూ పూచే హక్కున్నది
ప్రతి పక్షికీ పాడే హక్కున్నది
అని నిరూపిస్తున్నది ఆమని
జీవన రాగోద్దీప్తనని .."

ఇది ఎంత సార్వత్రిక, ప్రాకృతిక సత్యమో చూడండి. చెట్టుకు పూచే హక్కుంది. పక్షికి పాడే స్వేచ్ఛ ఉంది. మనిషికి కూడా అంతే కదా? మరి ఎందుకు దాడులూ దౌర్జన్యాలూ హత్యలూ అత్యాచారాలూ? మనం ఆధునిక సమాజపు ఆత్మగా భావించే భావ ప్రకటనా స్వేచ్ఛకు ఈ వాక్యాలను అన్వయించండి. ఎంత గొప్ప వ్యక్తీకరణ ఇది! ఎప్పటి నిరంకుశ పాలకులకైనా ఇది హితవే!

అలాగే మార్పు అన్నది సహజాతి సహజం. నిరంతరం జరుగుతూనే ఉంటుంది. ప్రతి ఒక్క పరిణామమూ మార్పులో భాగమే! మంచి మార్పు కోసం మనం కృషి చేస్తూనే- అప్పుడప్పుడు ఎదురయ్యే చేదు ఫలితాలను చూసి నిరుత్సాహపడకూడదని చెబుతున్నాడు, ఉగాది కవి. అది కూడా ఉగాది కాలం నాటి మార్పులను ప్రతీకగా తీసుకొని.

"రాలిపోయే ఆకుల్ని చూచి జాలిపడకు తమ్ముడూ
పారిపోయే నీటిని చూచి పల్లటిల్లకు తమ్ముడూ
ఆకులు రాలితేనే చెట్టు ఎదుగుతుంది
నీరు పారితేనే ఏరు జీవిస్తుంది."

ఎంత జీవిత సత్యం ఉంది ఈ మాటల్లో. ఎప్పుడు నిరాశ ముసురు ముంచుకొచ్చినా- ఈ అక్షర దీపాలను దానిని తరిమికొట్టవచ్చు. ఇలాంటి ఎన్నో అద్భుతమైన వాక్యాలకు ఉగాది కవి సమ్మేళనాలు వేదికలుగా నిలుస్తున్నాయి. ప్రకృతిలాగానే ఏటేటా కొన్ని వందల, వేల కవితా పూల గుత్తులను సమాజానికి ప్రసాదిస్తున్నాయి.

అభ్యుదయ రచయితల సంఘం, సాహితీ స్రవంతి, విరసం, బరవే వంటి సాహిత్య సంఘాలు తెలుగునాట నిరంతరంగా ఏదొకచోట కవిసమ్మేళనాలను జరుపుతూనే ఉన్నాయి. ఉగాది సందర్భంగా ఇంకా అనేక సంఘాలూ, సంస్థలూ రాష్ట్రంలో వేలాది కవితాగానాలను నిర్వహిస్తాయి. వేలాదిమంది కవులు, కవయిత్రులూ పాల్గొని తమ కవితాస్త్రాలను సంధిస్తారు. ఇదొక నిర్విరామ ప్రక్రియ.

ఉగాది నుంచి యుగాది దాకా ...

ఉగాది కవి ఉగాది కవిత్వానికే పరిమితం కాకుండా మరింతగా ఎదిగితే సమాజానికి ప్రయోజనం. ఈరోజు కవిత్వం గానానికో, ప్రచురణకో పరిమితమై లేదు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని విశ్వవ్యాప్తంగా విస్తరిస్తోంది. ఫేస్‌బుక్‌లు, వాట్సాప్, బ్లాగులు, ఈ-మ్యాగజైన్లలో విస్తారంగా ప్రసరిస్తోంది. సమకాలీన పరిణామాల మీద పదునైన వ్యాఖ్యగా వేలాదిమందిని ఆకట్టుకుంటోంది. నాలుగు గోడలను దాటి ఇంటింటా నెట్టింటా ప్రవహిస్తోంది.

మార్పు కాలానికి ఎలా సహజమో- సమాజానికి కూడా అలాగే సహజం. మార్పు జరిగే క్రమంలో ఉగాది కవిత్వం కూడా ఒక యుగాదికి ఆరంభం కావొచ్చు. ఒక పెనుమార్పుకు ప్రేరణ కావొచ్చు. ఉగాది కవి యుగాదికి ఒక దివ్వె కావాలి! అలా కావాలి అంటే- చుట్టూ జరుగుతున్న మంచిచెడ్డల మూలాలను, కారణాలను వెతికి పట్టాలి. వాటి గుట్టుమట్లను కవితాపతాకం పట్టి వినువీధిలో ఎగరేయాలి.

"మధుమాసం మార్పుకు ప్రతినిధి
ఉగాది నవతకు పునాది
చేదు తీపి కలిపి పాడు
శివకోకిలమీ ఉగాది
సమతా నవతానంద
సరస జీవన వినోది ...
ప్రభవ, విభవ, విప్లవ గీతాలు పాడే
పరభృతాలం మనమే
జీవన రాగ విరాగాలు పరిమళించే
భావపుష్పాలం మనమే
ఈ వసంతం మనమే
ఈ వనమంతా మనమే

అదుగో వచ్చాడు
చైత్రుడు! జైత్రుడు
అందరూ అనండి
కొత్త నాయకునికి జై
కాలవేదికి జై
ఉగాది జై!

ఉగాది ప్రత్యేక సంచికలు

దశాబ్దాల క్రితం తెలుగు పత్రికలు ఉగాది ప్రత్యేక సంచికలను వెలువరించేవి. 1910లోనే ఆంధ్రపత్రిక వ్యవస్థాపకుడైన కాశీనాథుని నాగేశ్వరరావు ఈ సంప్రదాయం మొదలెట్టారు. వాటిపై వచ్చిన పరిశోధనా వ్యాసాలను తిరగేస్తే కాలగమనంలో మానవ ప్రస్థానం కళ్లకు కడుతుంది. 1919 ఉగాది సంచికలో, బోల్షివిక్ విప్లవం గురించి పరిచయం చేశారు. జలియన్ వాలాబాగ్ దురంతాలపై నియమించిన హంటర్ కమిషన్ అభిశంసనను సుదీర్ఘంగా ప్రచురించారు. భారత ప్రభుత్వం చెన్నరాష్ట్రం పట్ల చూపుతున్న వివక్షను ప్రస్తావించి.. భాషా ప్రయుక్త రాష్ట్రాల అవసరాన్ని ఎలుగెత్తి చాటారు. 1944 రెండో ప్రపంచ యుద్ధ పరిస్థితిలో సంచిక తక్కువ పేజీలతో వచ్చింది. తర్వాతి కాలంలో సుప్రసిద్ధులైన తెలుగు కవులు రచయితల తొలి అడుగుల అక్షరాలు కూడా ఈ సంచికల్లోనే చూడవచ్చు. కాళోజీ 1946లో రాయల్ నౌకాదళ తిరుగుబాటును తన ఉగాది కవితలో జొప్పించడం ఓ చారిత్రక విశేషం.



వీరికి స్వర్గమే నరకం

వింటానికి ఊహించడానికి బానే ఉందిగా అని నమ్మేసేవాళ్లు బోలెడుమంది. తర్వాతి కోసమంటూ ఇప్పటి జీవితాన్ని పట్టించుకోనివాళ్లు బోబోలెడు మంది. అందుకే స్వర్గ నరకాల బ్రాండ్‌కు బోబోబోలెడు గిరాకీ పెరిగి మాంచి యాపారమైపోతోంది. చావులేని బతుక్కు ఏమన్నా చేసేస్తారు. కానీ వీరికి మాత్రం కలకాలమంటేనే గుండెల్లో వణుకు పుడుతుంది. చావులేని జీవితమంటే విసుగు పుడుతుంది. ఒళ్లంతా చెమట్లు పట్టేసి అసలీ స్వర్గమనే కాన్సెప్ట్ ఎవడి క్రియేటివిటీరా బాబూ అంటూ దడుసుకుంటారు. ఎపైరోఫోబియా పట్టుకుంటే అంతే మరి. అవి లేకున్నా ఆ మాటంటేనే బిగుసుకుపోతారు. కోట్లాది ఏళ్ల లెక్కలు బాగా తెలుసు కనుక విశ్వాంతరాళ దూరాలు ఎరుగుదురు గనుక ఎప్పటికీ బతికేయడమంటే విరక్తే అనేది వీళ్ల ఫిలాసఫీ. కాలంలో స్తంభించిపోవడంలానే ఉండే ఈ కాన్సెప్ట్‌లో ఇక పర్పజ్ ఏమిటని వారి సందేహం. టైమ్ పర్సెప్షన్, స్పేస్ పర్సెప్షన్‌లు చప్పబడిపోతాయిగా అంటారు. ఈ రకం ఫోబియాకు ఇంకా వికీపీడియా పేజే లేదంటే ఎంత తక్కువ సంఖ్యలో కేసులు సైకాలజిస్టుల వరకు వస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు. కానీ కొందరు మానసిక నిపుణుల అంచనా ప్రకారం ఈ తరహా భయంతో చాలామందే ఉండొచ్చని కానీ ఇలాంటివి వింతగా ఉంటాయని బయట మాట్లాడలేకపోవచ్చుట. మిగతా ఫోబియాల ఎఫెక్టే దీనికి ఉంటుంది. నిద్రలేమి, అతి ఆలోచనతో బుర్ర పాడుచేసుకోవడం ఎక్స్‌ట్రా. కరెక్టే దేనికైనా ఎస్కేప్ ఉండాలిగా.. మరి.

పాత ట్రెండ్‌గ్‌లు..

క్లాసిక్ అనేవి మొబైల్ ఫోన్‌లలోను వున్నాయి. అందుకే పాత మోడళ్లను సేకరించి ఒకాయన మ్యూజియం పెట్టేశాడు. 1231 వేర్వేరు మోడళ్లను సేకరించి 3500 మొబైల్స్‌ను ప్రదర్శనకు ఉంచాడు.. స్టెఫాన్ పోల్గారి. స్లొవేకియాకు చెందిన ఇరవై ఆరేళ్ల ఈ కుర్రాడు టెక్-హెడ్‌గా పనిచేస్తున్నాడు. పదిహేనేళ్ల వయసు నుంచే కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే మొబైల్ ఫోన్లపై ఆన్‌లైన్ రివ్యూలు రాస్తుండేవాడు. అంతకు ముందే మనోడి దగ్గర బోలెడు పాత ఫోన్లుండేవి. మరో సేకర్త దగ్గర నుంచి ఒకేసారి 1000 ఫోన్లు కొనేయ డంతో వాటి సంఖ్య రెండింతలైంది. వాటికి మరిన్ని పాత ఫోన్లను జతచేయడంతో ఓ చిన్న సైజు మ్యూజియం పెట్టుకోవచ్చనే ఆలోచన కలిగింది. మొత్తం 14 బ్రాండ్లలో మిస్సయిన మోడళ్లన్నింటినీ సేకరించేసి తనింట్లోనే మ్యూజియం పెట్టేశాడు. సొంతదేశంలో రికార్డు దక్కింది. ఇలాంటి సేకరణలతోనే 2010లో గిన్నిస్ బుక్ ఎక్కిన జర్మన్ కార్సన్ ట్యేయిస్ వద్ద 1563 వివిధ మోడళ్లున్నాయి. దీన్ని స్టెఫాన్ చేరుకోవడం చాలా తేలికే కానీ మనోడు వింటేజీ ఫోన్లపైనే దృష్టి పెడుతున్నాడు. మీ ఇంట్లో పాత ఫోన్ ఉందా అయితే అదీ మ్యూజియానికి పనికొస్తుందేమో.

వింత లోకం

నకిలీ మిత్రులు

పిచ్చి పీక్స్‌కు వెళ్లిపోయిందంటే ఇదేనేమో. చాంతాడంత ఫ్రెండ్స్ లిస్టుతో సామాజిక మాధ్యమాల్లో స్పెషల్‌గా కనిపించడానికి ముక్కూ ముఖం తెలీని వారికీ రిక్వెస్ట్‌లు పంపేస్తుంటారు... ఓకే చేసేస్తుంటారు. ఈ పిచ్చిని క్యాష్ చేసుకోడానికి ఓ జపాన్ కంపెనీ మరో క్లిక్కు తీసుకుని నకిలీ మిత్ర బృందంతో మిమ్మల్ని షేర్ ఆఫ్ ది వాల్ చేసేసి పాపులర్ చేసేస్తానంటోంది. నిత్యం ఫోనుల్లో మునిగి అసలు మిత్రులు పక్కనే ఉన్నా దూరం జరిగిపోతున్న కాలంలో ఫ్రెండ్షిప్ ముక్కలవడం, ప్రేమలు మాయమవడం షరా మామూలే. వాటినీ పోస్ట్ చేసి బాధపడటమూ అంతే మామూలు అయిపోయింది. అందుకే వీరికి ఉపశమనంగా నకిలీ ప్రియురాళ్లను, ప్రాణ మిత్రులను ఓ రెండు గంటల పాటు సోషల్ లైఫ్ ఫొటోల



కోసం అద్దెకిస్తామని ప్రకటించింది. వాళ్లెలాగు చాలా అందంగాను, స్మార్ట్‌గాను కనిపిస్తారు గనుక ఎక్స్‌లకు జెలసీ ఎక్కిపోయి తిరిగి మీ పక్షం చేరుతారని ఆశపెడుతోంది. అవసరమైతే నకిలీ తల్లిదండ్రులు, తమ్ముళ్లు, అక్కచెల్లెళ్లు, పిల్లలూ... ఇంకా చెప్పాలంటే పెద్ద పెద్ద పార్టీలకు ఫంక్షన్లకూ బంధు, మిత్ర గణాలను తండోపతండాలుగా పంపించగలమని.. మీకింత మంది తెలుసా అని అవాక్కయ్యేలా చేసే పూచీ మాదని చెప్పేస్తున్నారు. వీరికి సంబంధించిన చిత్రాలు, వివరాలు తమ వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచుతారు. బానే వున్నాడుగా అని ఒకే కుర్రాడిని ఇద్దరు మిత్రులు అద్దెకు తీసుకుని ఫొటోలు షేర్ చేస్తే అప్పుడేంటి?

ట్రిలియన్ చెట్లు నాటాలి..!



జర్మనీలో ఓ టీచర్ పిల్లలకి ఒక ఎసైన్‌మెంట్ ఇచ్చింది. పర్యావరణ మార్పు ధృవపు ఎలుగుబంటిపై ఏవిధమైన ప్రభావం చూపనుందనేదే ఆ ఎసైన్‌మెంట్. నాలుగురోజుల్లో పిల్లలందరూ ఎసైన్‌మెంట్‌ని పూర్తిచేసి దాన్ని టీచర్‌కి సబ్‌మిట్ చేశారు. ఫెలిక్స్ ఫిన్క్‌బెయినర్ కూడా ఎసైన్‌మెంట్‌ని పూర్తిచేశాడు. పర్యావరణంలో చోటుచేసుకున్న పెనుమార్పులు జంతుజాతులతో పాటు మానవ మనుగడనీ నాశనం చేస్తున్నాయనే అంశాలు అతన్ని కదిలించాయి. పర్యావరణంలో కార్బన్ ఉద్గారాల ప్రభావాన్ని తగ్గించే దిశగా మొక్కలునాటే ప్రయత్నం మొదలైంది. 'యుఎన్ బిలియన్ ట్రీ క్యాంపెయిన్' సహకారంతో 'ప్లాంట్ ఫర్‌ది ప్లానెట్'కి అంకురం పడింది. అది జర్మనీలోని వివిధ ప్రాంతాలకి చెందిన చిన్నారులని ప్రభావితం చేసింది. అలా బిలియన్ ట్రీ ప్రాజెక్ట్ వివిధ దేశాలకి పాకేసింది. 130కి పైగా దేశాల్లో 14 బిలియన్ చెట్లని నాటేలా చేసింది. పర్యావరణ అసమతుల్యతలని నివారించేందుకు ఇప్పుడు 'ట్రిలియన్ ట్రీస్' లక్ష్యంతో ముందుకెళతున్నాడు ఫెలిక్స్.

ఫెలిక్స్(19) పాప్ స్టార్, స్పోర్ట్స్ పర్సన్ కాదు. అయితే జెర్మనీలో ఇప్పుడు ఫెలిక్స్ పేరు అంతలా తెలీడానికి కారణం పర్యావరణ కార్యకర్తగా తను పనిచేయడమే....తొమ్మిదేళ్ల వయసులో పర్యావరణ పరిరక్షణ కోసం నడుంబిగించడం సాధారణ విషయమేం కాదు కదా..... స్కూల్ ఎసైన్‌మెంట్‌లో భాగంగా పర్యావరణ మార్పుల గురించి తను చేసిన శోధన 'ప్లాంట్ ఫర్‌ది ప్లానెట్'ని ప్రారంభించేలా చేసింది. పాఠశాలలో పర్యావరణ మార్పులపై తొలి ప్రసంగం ఇచ్చేందుకు గూగుల్‌లో తెగ సెర్చ్ చేసేశాడు ఫెలిక్స్. అలా 1977లో గ్రీన్ బెల్ట్ మూమెంట్‌ని ముందుకు తీసుకొచ్చిన వంగరి మథాయ్ గురించి తెలుసుకున్నాడు. స్థానిక మహిళా బృందంతో కలిసి భూక్షయాన్ని నివారించడంతోపాటు మొక్కలని నాటడం ద్వారా పర్యావరణ అసమతుల్యతలని నివారించేందుకు తను అవలంబించిన విధానాలన్నీ తనని ఆకట్టుకున్నాయి. 2004 నోబెల్ శాంతి అవార్డు గ్రహీతగా ఎంపికైన మథాయ్ అతితక్కువ కాలంలోనే 45 మిలియన్ చెట్లని నాటడం మాథాయ్ సంకల్పాన్ని మరింత ముందుకు నడిపించింది. మాథాయ్ కార్యాచరణ స్ఫూర్తితో మ్యూనిచ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పర్యావరణ మార్పుపై తన తొలి ప్రసంగం ఇచ్చాడు ఫెలిక్స్. ఆ ప్రసంగం అక్కడున్న చిన్నారులని కదిలించింది. పర్యావరణ మార్పుకి తనతో భాగమయ్యేలా చేసింది. ఆ తర్వాత ఫెలిక్స్ ప్రసంగాలు జర్మనీలోని వివిధ పాఠశాలలతోపాటు కొన్ని బహిరంగ వేదికలకీ మారిపోయాయి. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ మార్పులని క్రమబద్ధీకరించేందుకు మార్చ్ 28 2007 "మిలియన్ ట్రీ ప్రాజెక్ట్"ని ప్రారంభించాడు ఫెలిక్స్. తన ప్రసంగాల ద్వారా ప్రభావితులైన చిన్నారులందరూ వివిధ ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు తనతో కలిసి అడుగేశారు. మరికొందకు 'ప్లాంట్ ఫర్‌ది ప్లానెట్' వెబ్‌సైట్‌ని ఏర్పాటుచేసేందుకు సహకారం అందించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా తన ఆశయాన్ని ప్రపంచవ్యాప్తంగా ముందుకు తీసుకెళ్లాడు ఫెలిక్స్. పర్యావరణ మార్పుపై చర్చలతో మొక్కల్ని నాటే కార్యక్రమం మరింత వేగవంతమైంది. స్థానిక రోటరీ క్లబ్‌లో తన ప్రసంగాన్ని విన్న టొయోటా కార్ల కంపెనీ సిఇఓ తన ప్రాజెక్ట్‌కి ఆర్థిక సాయం చేసేందుకు ముందుకొచ్చాడు. స్థానికంగా కొందరు దాతలు అందించిన ఆర్థిక సాయంతో మొక్కలు కొని నాటించేవాడు. ఫెలిక్స్ ప్రాజెక్ట్‌కి ఆర్థిక సాయంచేసిన కొన్ని సంస్థలు వివిధ ప్రాంతాల్లో బడి పిల్లలతో చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించాయి. 2008 ఏప్రిల్ కల్లా జర్మనిలో 5వేలమొక్కల్ని నాటి తన కార్యాచరణలో ముందడుగేశాడు ఫెలిక్స్. స్థానిక మీడియా ద్వారా ఫెలిక్స్ ఆశయం పక్కదేశాలకీ పాకేసింది. అక్కడ కూడా మొక్కలు నాటే కార్యక్రమాలు మొదలయ్యాయి. 2008లో నార్వేలోని స్టావింజర్ ప్రాంతంలో నిర్వహించిన యుఎన్ బాలల సదస్సులో గ్లోబల్ వార్మింగ్‌పై ప్రసంగించే అవకాశాన్ని అందుకోవడంతోపాటు యుఎన్ ఎన్విరాన్‌మెంటల్ ప్రోగ్రామ్ (యుఎన్‌ఇపి)కి జూనియర్ బోర్డ్ మెంబర్‌గా ఎన్నుకోబడ్డాడు. అదే సంవత్సరం యూరోపియన్ పార్లమెంట్‌లో ప్రసంగించాడు. 2009లో యుఎన్‌ఈపి తరపున దక్షిణ కొరియాలో జరిగిన పర్యటనల్లో బిలియన్ చెట్ల ఆవశ్యకతపై ప్రసంగాలు కొనసాగాయి. అధిక సంఖ్యలో వాతావరణంలోకి వెలువడుతున్న కర్బన ఉద్గారాల ద్వారా ప్రపంచం ఎదుర్కోనున్న ప్రమాదాలని గణాంకాలతో సహా అందరి ముందుకు తీసుకొచ్చాడు. 'ప్లాంట్ ఫర్‌ది ప్లానెట్' ఆశయానిన మరిన్ని దేశాల్లోకి తీసుకెళ్లేందుకు 12 మందితో కూడిన ఒక బృందం రూపుదిద్దుకుంది. వీళ్లందరూ పన్నెండేళ్లలోపు వయసున్న చిన్నారులే. 'ప్లాంట్ ఫర్ ది ప్లానెట్' గ్లోబల్ అధ్యక్షుడి కోసం ఏడాదికి ఒకసారి ఎన్నికలని నిర్వహిస్తారు. వాతావరణ మార్పు సంబంధిత అంశాలపై అభ్యర్థులు ఇచ్చే ప్రసంగాలపై వారి ఎంపిక ఆధారపడి వుంటుంది. 'ప్లాంట్ ఫర్‌ది ప్లానెట్' బృందంతో కలిసి ఇప్పటికే 130 దేశాల్లో పర్యటించి ప్రసంగించడంతోపాటు 14 బిలియన్ మొక్కల్ని నాటించాడు. 2020 నాటికి వాతావరణంలో కార్బన్ ఉద్గారాల శాతాన్ని 2 డిగ్రీలసెల్సియస్‌కి తగ్గించేందుకు గాను ప్రతి వ్యక్తి 150 మొక్కలని నాటేలా 'ట్రిలియన్ ట్రీ ప్రాజెక్ట్'తో మరిన్ని దేశాల్లో అవగాహన సదస్సులని నిర్వహిస్తున్నాడులిక్స్.



- శర్వాణి

నా కళ్లతో



మెరోయ్ పిరమిడ్ల వద్ద..

ఆఫ్రికాలో ...

మోనికాకు ఆమె తల్లికి ఆ రాత్రి నిదురలేదు. 23 ఏళ్ల కూతురు ఒంటరిగా దేశాలు చుట్టొస్తానంటే అది కూడా హిచ్‌హైకింగ్ చేస్తూ అనే విషయం భయ పెడుతోంది తల్లిని. నా కలల యాత్ర తొలి ప్రయాణానికి ఇంకా తెలవారలేదేంటనేది మోనికా కలత నిద్ర. తెల్లారింది ఇదివరకటిలానే చివరి నిమిషం హడావిడి. బ్యాగులో బట్టలు సర్దుకోవాలి. పాస్‌పోర్ట్ వంటివి చెక్ చేసుకోవాలి. ఇంట్లోనే ఇలా అయితే అక్కడెక్కడో సుదూరంలో ఎలానే తల్లి చీవాట్లు. ఆగిపోవచ్చు కదా అనే బుజ్జగింపులు. లేదు మోనికా వెళ్లాలి.. ఆఫ్రికా అంతటా చుట్టి రావాలి. 12 నెలల్లో 12 దేశాలైనా చూసి రావాలి. వేలాదిమందిని కలసి రావాలి. ఎక్కడ పోలెండ్ ఎక్కడ ఆఫ్రికా దేశాలు. భాష వేరు, సంస్కృతి వేరు, వాతావరణం వేరు, అలవాట్లు వేరు అయినా ఈ అమ్మాయి మొండి పట్టు వీడదే తల్లి బాధ తల్లిది. అందులోను యాత్రంతా లిఫ్ట్ అడిగి కార్లు, ట్రక్కులు మారి వెళుతుందట. ఈ పిల్లకేమైందో అర్థం కావడం లేదు. డబ్బు చూసుకుని తీరిగ్గా ఏ పక్కా పర్యాటక సంస్థ ద్వారానో వెళ్లి చూసిరావచ్చు కదా. మోనికా తల్లి మాట ఎక్కడ వింటుంది. హోటళ్లు, లాడ్జులు, ఇతరత్రా ఆతిథ్యాలు.. గంటా రెండు గంటలు స్థానిక గ్రామాల్లో సందర్శనలు.. మాంచి టూరిస్ట్ స్పాట్ దగ్గర సెల్ఫీలు... వీటిల్లో ఆఫ్రికా ఏం కనిపిస్తుంది. అంతా పైపై మేకప్పే. లోతుగా చూడాలి. పూర్తిగా అవగతం చేసుకోవాలి. ఆఫ్రికా ఇంటిలో నిజమైన జీవితం కావాలి. అందుకే కుదిరితే ఓ లిఫ్ట్ లేకుంటే నలభై మైళ్లు నడకే. గ్రామగ్రామాన్ని, వీధి వీధినీ ఇంటి ఇంటినీ చూస్తూ అనుభవంలోకి తీసుకుంటూ యాత్ర సాగాలి. అక్కడ పెళ్లిళ్లకు హాజరవ్వాలి. వధూవరులకు ఓ ఫొటోను ప్రెజెంట్ చేయాలి. అక్కడి డిన్నర్‌లకు అటెండ్ కావాలి. అక్కడి అమ్మ ముద్ద రుచెరగాలి. మోనికా అనుభూతించాలనుకుంటున్నవి చాలా ఉన్నాయి. ఇవన్నీ ఓ ప్లాన్‌డ్ టూర్‌తో సాధ్యమా. ఓ గైడెడ్ సందర్శనతో సంతృప్తేనా.!

లేదు స్వయంగా తెలుసుకోవాలనేదే మోనికా లాంటి హిచ్‌హైకర్ల యాత్రోద్దేశం. గతేడాది మార్చి తొమ్మిదిన ఆమె ఇంటిని వదిలేసింది. ఆఫ్రికా ఉత్తర కొసలోని ఈజిప్ట్‌లో వాలింది. తనకు తొలి లిఫ్ట్ ఇచ్చిన కారు డ్రైవర్ ముఖం ఇంకా ఆమెకు గుర్తుంది.

ఒంటరితనం నుంచి...

షర్మ్ ఎల్ షేక్ నుంచి ఆమె ఆఫ్రికా యాత్ర మొదలైంది. తొలిరోజే సినాయ్ నుంచి హిచ్‌హైకింగ్‌కు చేయి చూపిన మోనికా అక్కడి నిర్మానుష్య పర్వత ప్రాంతంలో తొలిసారి ఒంటరితనపు భయాన్ని చవిచూసింది. చాలా సేపు ఎదురుచూపుల తర్వాత అటుగా పాట్రోలింగ్‌కు వచ్చిన పోలీసులు ఆమెను తర్వాతి ప్రయాణానికి చేర్చారు. కైరో పాతబస్తీలో బెడ్యూన్ టీతో హమ్మయ్య అనిపించాక పిరమిడ్ల మీదకు మనసు మళ్లింది. గీజా పిరమిడ్ వద్దకు నానాతిప్పలు పడి చేరుకున్నాక గానీ ఆమె వెంపర్లాట తగ్గలేదు. అస్వాన్‌కు దగ్గరలోని నుబియన్ గ్రామంలో స్థానిక కాఫీ ఫ్లేవర్‌ను ఆస్వాదించాక ప్రయాణ భారం ఎగిరిపోయింది. పిరమిడ్ల వద్దే టెంట్ వేసుకుని ఓ రాత్రి గడిపాక కానీ తృప్తి అనిపించలేదు. ఈజిప్ట్ మారుమూల గ్రామాల్ని దాటుకుంటూ సూడాన్‌కు చేరాక పూర్తి భిన్నమైన వాతావరణం కనిపించింది. ఒక్కో దేశంలోనే కాదు ఒక్కో ప్రాంతం ఒక్కో గ్రామానికే చాలా విలక్షణంగా ఉంటుంది ఆఫ్రికా తీరు. వందల భాషలు, తెగలు, వేషధారణలు, ఆహార్య, ఆహార అలవాట్లు అన్ని విభిన్నమే. పట్టణాల్లో మాత్రం పాశ్చాత్య ధోరణి బాగా కనిపించింది. కానీ కొన్ని గ్రామాల్ని చూస్తే చరిత్ర ఆనవాళ్లలా, సజీవ శిలాజాల్లా, ప్రాచీన ఆఫ్రికన్ సాంస్కృతిక శిథిలాల్లా

ఓ ప్రయాణంలో

అనిపించింది. సూడాన్‌లోని ఓమ్
సూఫీల జిక్ర్ పండుగకు హాజరై
మేళవింపు స్పష్టంగా అర్థమైంది.
విషయం అక్కడికి చేరాక కానీ తె
అవాక్కయ్యింది. ఆ ప్రదేశం బాగా
వేసింది. మోనికా తన యాత్ర మ
లాడ్జిలో, కానీ హోటల్‌లో కానీ
పోలీస్‌స్టేషన్లు, చర్చిలు వంటి చో
వేసుకుని రాత్రులు గడిపేది. లేదా
ఇస్తే వారింట్లో ఉ
ఆమెకు చా
ప్రేమను వ
నవ్వుతూనే
మోనికా శ
సూడాన్‌న
కులాంటి
ముచ్చట
ఏ
స
ప్రాంత
గ్రామా
ఓ వింత ఘ
చెందిన ఓ వ్యక్తి మోనికాను పెళ్లి
కన్యాశుల్కంగా 46 ఆవులు, 11
ఇస్తానని చెప్పాడు. మోనికా ఈ
అతడిని బుజ్జగించి ఎలాగోలా ఆ
ఆఫ్రికా అంటే ఇష్టమన్నావ్... చేస
ఉండిపోయే దానివి అని అమ్మ ఆ
తానే నవ్వుకుంది. సూడాన్ నుం
మోనికా బ్లూ నైల్ జలపాతాన్ని చ
ఇథియోపియాలో ప్రయాణమంత
కెన్యాలో మాత్రం ఆమెకు ఊహిం
ఉగ్రవాదేమో అనుకుని పోలీసుల

కస్సాలా, సూడాన్

బ్లైడ్ కేన్యన్, దక్షిణాఫ్రికా

మసాయ్ తెగవారితో..

పెళ్లి చేసుకుంటానన్న హమేర్ తెగకు చెందిన వ్యక్తి



ఓ వైల్డ్ యాత్ర

సినాయ్‌లో లిఫ్ట్ అడుగుతూ..

ఒక అమ్మాయి లిఫ్ట్ అడిగి 150 పైగా కార్లలో 12 వేల కి.మీ.ల పైగా యాత్ర చేసింది. అక్కడ కొన్ని స్థానిక పెళ్లిళ్లకు ప్రత్యేక అతిథి అయ్యింది. ఆఫ్రికన్ తెగల యువకుల ప్రేయసిగా కొలువైంది. 100 జీబీ దాటిన ఫొటోలు, వీడియోల్లో లెక్కలేనన్ని అనుభూతుల్ని మూట కట్టుకుంది. లేనిపోని అనుమానాలతో 3 రోజులు జైల్లో గడపాల్సి వచ్చింది. చాలా చోట్ల దోపిడీకి గురైంది. అయినా ఆమె ఆఫ్రికా యాత్ర ఆగలేదు. ఏడాదిలో 12 దేశాల్ని చుట్టేసి మరో 12 నెలలు తన సొంతిల్లు ఆ దేశమే అని చెబుతోంది. పోలెండ్‌కు చెందిన హిచ్‌హైకర్ మోనికా సాహస యాత్ర ఇది. తన పేరులో మసాయ్ ఉందని ఆఫ్రికాలో ఆ తెగను వెతుక్కుంటూ ఒక యువతి ఒంటరిగా ఇంత వైల్డ్ యాత్ర చేసిందంటే నమ్మలేని వారికి కొన్ని వివరాలివే...

డుర్మన్‌లో విశేషంగా చెప్పుకునే ...వ మోనికాకు అక్కడి పాత, కొత్తల ...సూడాన్‌లోను పిరమిడ్లున్నాయనే ...లీదు. మెరోయ్ పిరమిడ్లను చూసి ... నచ్చేయడంతో అక్కడా టెంట్ ...త్తంలో ఎక్కడా కూడా ఓ ...వ చేసింది లేదు. ఆమె ...ల అనుమతి తీసుకుని టెంట్ ... స్థానికులు ఎవరైనా ఆతిథ్యం ...ండేది. ఇలా వందలాది మంది ... దగ్గరయ్యారు. కొంత మందైతే ...క్షం చేశారు కూడా. వాటిని ...తిరస్కరించినా వారి అభిమానానికి ...నా అయిపోయింది. పోర్ట్ ... చూసొచ్చాక మన గోరింటా ...హెన్నాను చేతులకు వేయించుకుని ...పడింది.

...ం పిల్లా పెళ్లి చేసుకుందామా

...డాన్‌లోనే కస్సాలా పర్యాటక ...న్ని చూసింది. దగ్గరలోని ...ల్లో కొన్ని రోజులు గడిపాక ఆమెకు ...టన ఎదురైంది. హమేర్ తెగకు ... చేసుకుంటానని వెంటబడ్డాడు. ...మేకలు, 7 గొర్రెల్ని ఆస్తిగా ...పరిణామంతో స్టన్ అయ్యింది. ... గ్రామం నుంచి బయటపడింది. ...సుకోపోయావ్... ఎంచక్కా అక్కడే ...టపట్టిస్తుందేమో అని తనలో ... ఇథియోపియాకు చేరుకున్న ...హసి పరవశించింది. ... కొంచెం సాఫీగానే సాగినా ...చని కష్టాలు ఎదురయ్యాయి. ఆమె ... అరెస్ట్ చేశారు. కొన్ని రోజులు

జైల్లో గడపాల్సి వచ్చింది. తనను బంధించిన గది చాలా జుగుప్సాకరంగా ఉండటంతో అక్కడి పరిస్థితులు ఆమెకు చాలా బాగా అర్థమయ్యాయి. మోనికా యాత్ర విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను విడిచిపెట్టాక ఈసారి దొంగల వల్ల ఇబ్బంది పడింది. ఓ వ్యక్తి కత్తి పట్టుకుని గొంతుకు పెట్టి కెమెరాను బ్యాగును అప్పజెప్పాలని బెదిరించాడు. వాటిని ఇవ్వలేనని కావాల్సివస్తే తన బ్యాంకు అకౌంట్‌లోనున్న మొత్తం సొమ్మును ఇచ్చేస్తానని చెప్పింది. పక్కనే ఉన్న ఏటీఎంలోంచి మొత్తం డబ్బు తీసి ఇచ్చేసింది. వాడు అవి తీసుకుని వెళ్లిపోయాక గానీ అనిపించింది మొత్తం ఇచ్చేస్తే తన మిగతా ప్రయాణం ఎలా అని. అప్పటి నుంచి తన చేతనైన పనులు చేస్తూ తిండికి సంపాదించుకునేది. అలా కెన్యాలోని డయాని బీచ్, మొంబాసా పాతబస్తీ, సంబురు గ్రామాల్లో గడిపింది. అక్కడే మసాయ్ నృత్యాల్ని చూసింది. విచిత్రంగా మోనికా ఇంటిపేరు కూడా మసాయ్ అని అర్థం వస్తుంది. ఆ తర్వాత ఉగాండా, రువాండాలోని అకగెరా జాతీయ వనం, జాంజిబార్‌లోని స్టోన్ పార్క్, టాంజానియా, మొజాంబిక్, స్వాజిల్యాండ్, దక్షిణాఫ్రికా, బోట్స్వానాలను చుట్టింది. దక్షిణాఫ్రికాలో బ్లైడ్ కేన్యన్ వద్ద టెంట్ వేసుకుని కొన్ని రోజులుంది. అంత ఆకట్టుకుంది ఆ ప్రదేశం.

కేప్ టౌన్‌తో ప్రేమలో...

ఇక ఆఫ్రికా యాత్ర మొత్తంలో ఆమెకు అత్యంత అద్భుతంగా తోచిన ప్రదేశం కేప్ టౌన్. సిమన్స్ టౌన్ బీచ్‌లో పెంగ్విన్లను చూసి ఆశ్చర్యపోయింది మోనికా. కేప్ టౌన్‌లో స్థిరపడిపోయి అక్కడే చనిపోవాలన్నంతగా కట్టిపడేశాయి అక్కడి దృశ్యాలు. కుదిరితే యాత్రను కూడా అక్కడే ఆపేయాలని అనుకుంది. బోట్స్వానాలో సఫారీ చేసే అవకాశం వచ్చింది. రోడ్డుకు అడ్డంగా పడి ఏనుగులు గుంపుగా గంభీరంగా పరుగుతీసిన దృశ్యం ఆమెను గగుర్పాటుకు గురిచేసిన ఓ సందర్భం. ట్జోడీలో కొండల్లోని ఘాట్ మలుపుల్లో కారు నిలపడానికి అవకాశం లేకపోవడంతో ఆమెకు ఎవరూ లిఫ్ట్ ఇవ్వలేదు. ఒక్కర్తే ఆ కొండ ప్రాంతంలో 30 మైళ్లు నడిచి దగ్గరలోని గ్రామానికి చేరుకుంది. జాంబియా వైపు ప్రయాణాన్ని కొనసాగించింది. అలా చేయకుంటే జాంబియాలోని కలంబో జలపాతాన్ని మిస్సయిపోయేదానినేమో అని ఇప్పుడు అనుకుంటోంది. జాంబియాలోని లుసాకోలోను దొంగల బెడద తప్పలేదు. గొంగళిపురుగులతో చేసిన వంటకాల్నీ రుచి చూడాల్సొచ్చింది. తప్పక పురుగుల భోజనం చేయాల్సొచ్చింది. తనకు అస్సలు సరిపడని వంటకాలే ఆఫ్రికా అంతటా ఉండటం చాలా సమస్య అయ్యింది. కానీ ఆమెకు తనకు కలిగిన ఇబ్బందుల కన్నా విలువైన, మరచిపోలేని అనుభూతులే ఎక్కువ గుర్తున్నాయి. వాటిల్లో ముఖ్యమైంది తమ దేశవాసులు రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జాంబియా, టాంజానియాలకు శరణార్థులుగా చేరిన విషయం. అప్పటి మరణాలకు చిహ్నంగా ఉన్న సమాధుల్ని ఆమె సందర్శించింది. చాలా ఉద్వేగానికి లోనైంది. తన కూడా తెచ్చుకున్న పోలిష్ జెండాను వాటి వద్ద ఉంచి నివాళులు అర్పించింది. స్థానికులు చాలామందికి వాటి ఉనికి గానీ, చరిత్ర గానీ తెలీకపోవడం ఆమెకు విస్మయాన్ని కలిగించింది. మ్యాప్‌ల్లోను ఎక్కడా వాటి జాడ లేదు. ఎవరో చెబితే వెళ్లి చూడగలిగింది. ఇప్పుడు తన ద్వారా తమ దేశంలోని చాలామందికి ఆ విషయం తెలిసింది. అందుకే ఒక ఏడాదే అంటూ మొదలెట్టిన ఆఫ్రికా యాత్రను మరో ఏడాది పాటు కొనసాగించాలని నిశ్చయించుకుంది. ప్రస్తుతం మొరాకో వైపు కదులుతోంది.

మోనికా యాత్రకు ఓ రూటూ, ప్లానూ ఉండదు. అప్పటికప్పుడు నిర్ణయం తీసుకుంటుంది. అందుకే 'బ్రోకెన్ కంపాస్' అని తనకు పేరు తగిలించుకుంది.

- అనన్య ప్రసిద్ధ్

సుస్వాగతం హేవిళంబి

ప్రభవ విభవ మీదుగా ప్రారంభమైన నీ పయనం
క్రోధన అక్షయ దాటి మళ్లీ ప్రభవలో విలీనం
ఉగాదీ జగతికి ఓ యుగాదీ...
భూ భ్రమణంతో పాటు నీ భ్రమణం నిత్య నూతనం
అనాదిగా సూరీళ్లను నిద్రలేపాను నిద్రకు సాగనంపాను
ఉగాదుల్ని స్వాగతించాను
పేరు ఏదైతేనేం కాలచక్రానికి రెక్కలై వచ్చి
వత్సరానికోసారి కటాక్షిస్తావు
ఆశలు రేపిన దుర్ముఖిలో అంచనాలు తలవంచాయి
వర్తమానానికి భూతకాలం భూమిక
మట్టిని బంగారం చేసిన మేధస్సుని
మట్టిని స్వేదంగా మార్చిన శక్తిని
అంటుగట్టి పెంచింది
భవిష్యత్తు దోసిట్లోకి దిగుబడి వొదిగింది
దొరికింది దొరకబుచ్చుకుని దోపిడీ దౌర్జన్యాలు
దొరకని దానికి వెంపర్లాడుతుంటే
ఆర్థిక బలం స్థితి బలం భుజ బలం కుల బలం
మత బలాలకు రాజ్యం హస్తగతమైంది!
సన్నకారు చిన్నకారు అభాగ్యులు
నిర్వికారంగా నిర్లిప్తంగా నిస్సహాయంగా నిలబడితే
కథ అర్ధాంతరంగా కంచికి చేరింది
భవిష్యత్తుకు వర్తమానం పీఠిక
పీడితులకందని భవిష్యత్తు భూతకాలంలో విలీనమైంది
తెల్లజెండా ఎగరేసి దుర్ముఖి అనుతాపంలో నిష్క్రమించింది!
సుస్వాగతం హేవిళంబీ
పచ్చతోరణం కట్టబడింది ఎర్ర తివాసీ పరచబడింది
కథ ప్రారంభం కావాలి యుద్ధం ఏదైనా
ఫలితం యింటింటా ప్రభవించాలి
కొమ్మకొమ్మకు ఆమని గొంతెత్తాలి
చలిచీమల చేతచిక్కి సర్పాలు నశించాలి!

- అడిగోపుల వెంకటరత్నమ్

9848252946

కవిత్వమ్

ఆమె వొస్తుందనే!

ఆమె వొస్తుందనే మళ్లీ ఎదురు చూస్తున్నాను
ఏ మామిడి కొమ్మ ఊయల మీంచి ఊగుతూ వొస్తుందో
ఏ కలల పల్లకీలో ఊరేగుతూ వొస్తుందో
ఏ కల కోయిల కమ్మని గీతాల్లో తడిసి వొస్తుందో
ఏ వేప కొమ్మ సందుల్లోంచి కిరణంలా తొంగిచూస్తూ వొస్తుందో
ఏ మేఘాల చినుకు మెట్ల మీంచి జారిపడి వొస్తుందో
ఎన్ని పూలను తురుముకొనొస్తుందో తన తెలుగుతనపు సిగలో
ఎంత ఆకు పచ్చదనాన్ని పులుముకుని వొస్తుందో
తన మెరుపు కళ్ల చూపులో ఎన్ని ఆశల మోదుగు పూలు
ఎన్ని కోర్కెల బంతి పూలు ఎన్ని కలల తంగేడు పూలు
తన ఆకుపచ్చని చీర నిండా పూల డిజైన్ కుట్టుకుని వొస్తుందో
కూలిన వెనకటి నిరాశల శిథిలాలను గిల్లిన కన్నీటి శకలాలను
విరిగిన కలల గాజు పెంకులను మరపు మూలల్లో
తన కాళ్ల కిందేసి తొక్కుకుంటూ
తన చేతుల్లో మాత్రం ఏవేవో కొంగొత్త ఆశలూ
ఆకలిని చెరిపేసే అన్నం మెతుకులు
కన్నీటిని తుడిచేసే ఆత్మీయ హస్తాలు
ఒంటరితనాలను చెరిపేసే మాటల చిలుకలను
రేపటికై నిర్మించిన పూల వంతెనల దారులను
మా కోసం తప్పక మూట గట్టుకునొస్తుందని
ఆశగా ఎప్పటిలాగే ఆమె కోసం
అమ్మ కోసం ఎదురు చూసినట్లే
ఎదురు చూస్తూ ఉన్నాను

- నిరంతర

9133832246

తోకలు తగిలిస్తారట..!

తెలుసా

● పదిహేనవ శతాబ్దం వరకు ఫ్రాన్స్ వాసుల క్యాలెండర్‌లో కొత్త సంవత్సరం మార్చి1 నుంచి ప్రారంభమయ్యేది. పదహారవ శతాబ్దంలో జనవరి 1కి కొత్త సంవత్సరం సంస్కరించబడింది.(జూలియన్ క్యాలెండర్ నుంచి గ్రెగోరియన్ క్యాలెండర్‌కి షిఫ్ట్ అయ్యారన్న మాట) అలా 1556లో ఫ్రాన్స్ వాసులు కొందరు క్యాలెండర్‌లో చోటుచేసుకున్న ఈ మార్పులని గుర్తుపెట్టుకోకుండా ఎప్పటిలాగే మార్చ్ 25 నుంచి ఏప్రిల్ 1 మధ్య కొత్త సంవత్సరం వేడుకలని నిర్వహించేవారు. మార్పుని గుర్తు పెట్టుకోకుండా అలా కొత్త సంవత్స వేడుకలని జరుపుకునే వారిని తెగ ఆట పట్టించేస్తూ ఫూల్స్ అనే వారు. అలా పుట్టుకొచ్చిందే ఈ ఏప్రిల్ ఫూల్స్ డే...

● మతిమరుపు వ్యక్తులని హాస్యపు మాటలతో ఆటపట్టించే ఆ అలవాటే తర్వాతి కాలంలో ఏప్రిల్ ఫూల్‌డేగా ప్రచారంలోకి వచ్చింది.

● చరిత్రకారుల ప్రకారం ఏప్రియల్ ఫూల్‌డేని 1582 నుంచి ఒక సాంప్రదాయ వేడుకగా జరుపుకుంటున్నారు.

● ఫ్రాన్స్‌లో ఏప్రిల్ నెల మొదటి రోజున కొందరు ఆకతాయిలు ఇతరులకి తెలీకుండా వీపుపై కాగితం చేప బొమ్మల్ని అతికించేవారు. అలా అతికించ బడ్డవారిని పాయిజన్డ్ అవ్‌రిల్/ ఏప్రిల్ ఫిష్ అని పిలుస్తారు. అలా ఫ్రెంచ్ భాష నుంచి ఏప్రిల్ ఫూల్ అనే పదం పుట్టుకొచ్చేసింది.

● తొలి నాళ్లలో ఏప్రిల్ ఫూల్‌డేని ఆల్‌ఫూల్స్ డేగా పిలిచేవారు.

● పురాతన రోమన్ సాంప్రదాయంలో మార్చ్ నెలలో జరుపుకునే పండుగ హిలేరియాతో ఏప్రిల్ ఫూల్స్‌డే ముడిపడి వుందనేది రోమన్ల నమ్మకం. అందులో భాగంగా ఏప్రియల్ ఫూల్స్ డే రోజున మారు వేషాలు ధరించి అందర్నీ ఆటపట్టిస్తుంటారు.

● మధ్య యుగంలో ప్రచారంలో వున్న హాస్యాస్పద రూపాలు ఎలెక్స్ ది జెస్టర్, గ్రామెల్టన్, జోకర్ చిత్రాలు ఏప్రిల్ ఫూల్స్‌డే వేడుకల్లో భాగమయ్యాయి.

● ప్రతి సంవత్సరం ఏప్రిల్ మొదటి రోజున ఫూల్స్‌డేని నిర్వహిస్తారు.

● వివిధ దేశాల్లో శతాబ్దాలుగా ఏప్రిల్ ఫూల్/ ఆల్‌ఫూల్స్‌డేని జరుపుకుంటున్నా దాని కచ్చితమైన మూలాలు మాత్రం ఎవరికీ తెలీదు.

● 1392లో జియోఫెరే ఛాసర్ రాసిన 'క్యాంటర్ బరీ టేల్స్' అనే పుస్తకంలో ఏప్రిల్ మొదటి రోజున ఆకతాయిలు చేసే అల్లరి పనులు, హాస్యాల ప్రస్తావన వుంది.



● 18వ శతాబ్దంలో బ్రిటన్‌లో మొదలైన ఏప్రిల్ ఫూల్స్‌డేని అక్కడి ఒక వార్షిక వేడుకగా జరుపుకుంటారు. హాస్యోక్తులు, అల్లరి పనులతో ఒకరినొకరు ఆటపట్టించుకుంటారు.

● 1957లో స్విస్‌కి చెందిన రైతులు ఒకరకమైన చెట్టు నుంచి పెద్దమొత్తంలో నూడుల్స్‌ని ఉత్పత్తి చేసిన ఫూటేజ్‌లని చూపించి .... బిబిసి ఎంతో మంది ప్రేక్షకులని ఫూల్స్ చేసింది. ఆ తర్వాత కొన్ని పేపర్లు, రేడియో, టివి ఛానెళ్లు, వెబ్‌సైట్లు వీక్షకులని ఏప్రిల్ ఫూల్ చేసేందుకు ఇలాంటి కాల్పనిక సన్నివేశాలనెన్నిటినో ప్రవేశ పెట్టాయి.

● స్కాట్‌ల్యాండ్‌లో ఏప్రిల్ ఫూల్స్‌డే వేడుకని రెండు రోజుల పాటు నిర్వహిస్తారు. గైక్(విహరించే ఒక పక్షి)ని పట్టుకోవడం తెలివితక్కువతనానికి చిహ్నంగా దీన్ని నిర్వహిస్తే మరుసటి రోజు జరుపుకునే టెయిలీ డేలో ఆకతాయిలు కొందరికి 'కిక్ మి' (నన్ను కొట్టండి) అని రాసున్న అట్టముక్కల్ని అంటిస్తారు. కొందరికి కృత్రిమ తోకలని తగిలుస్తారు. అంతా సరదా కోసమే.....

● కొత్త సంవత్సరం సిజ్‌దాహ్ బేదర్ 13వ రోజున అంటే ఏప్రిల్ ఒకటి లేద రెండో తేదీన ఏప్రిల్ ఫూల్స్‌డే నిర్వహించే ఆచారం ఇరాన్‌లో క్రీపూ 536 నుంచి కొనసాగుతోంది. ఆ రోజున ఆకుపచ్చని కూరగాయలని బైటపడేస్తారు. పాత సంవత్సరపు చేదు అనుభూతులని బైటికి నెట్టివేసే సూచనట అది.

● ఏప్రిల్ ఫూల్స్‌డే రోజున యూరప్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా దేశాల్లో ఆకతాయిల అల్లరి చేష్టలు దాదాపు ఆ రోజు మొత్తం కొనసాగుతాయి. అయితే అమెరికాలో మాత్రం వీటిని మధ్యాహ్నం వరకే అనుమతిస్తారు.

● కాల్పనిక వాదనలు, సంఘటనలతో ఇతరులని నమ్మించి నవ్వు తెప్పించే ఓ ప్రక్రియ ప్రస్తుతం ఏప్రిల్ ఫూల్స్‌డే రోజు ప్రచారంలో వుంది.

ఇద్దరు మహిళలు

మూలం : వాంగ్ వెన్షి
అనువాదం : సుంకర కోటేశ్వరరావు
9948023464

“నువ్వు వూ షులాన్‌వి కదూ? నిన్ను చూడాలని ఎప్పటి నుండో అనుకుంటున్నాను. నువ్వెంత నాజూగ్గా వున్నావు తల్లీ...!” వూ షులాన్ కందిపోయినట్లున్న సోగముఖంతో, ఇరవై దాటిన వయసులో పొలంగట్టు పైన స్థిరంగా నిలబడి కన్నార్పకుండా ఆ మాట్లాడే మనిషిని చూస్తు వుంది. ఆమె వెనక నీలాకాశం అంచుల వరకూ పత్తి పొలాలు విస్తరిల్లి కనిపిస్తున్నాయి.ఇప్పుడు మాట్లాడింది కూడా దాదాపు వూ షులాన్ వయసున్న ఓ యువ మహిళే! కాకపోతే కొద్దిగా వయసు మించిన దానిలా కనిపిస్తుంది. వూ కళ్లు “నువ్వెవరివీ తల్లీ!” అన్నట్లు శోధిస్తున్నాయి. “నేను ఝూంగ్ లేయూని అదే భయంకర యుద్ధనౌక అంటారే! బహుశ నువ్వు నా గురించి వినే వుంటావు” ఆ యువతి కొంచెం గర్వంగా చెప్పుకుంది.“అవును నీ గురించి విన్నా!” సమాధానంగా అంది వూ షులాన్. “మొదటి సమావేశంలో కొత్తవాళ్లు రెండో సమావేశానికి పాతమిత్రులు.. మనం ఈ రోజున కలిశాం. అక్కాచెల్లెళ్లమయ్యాం. మనిద్దరం ‘అజ’ సంవత్సరంలో పుట్టాము, అవునా?” “అవును” షులాన్ చిరునవ్వుతో.“భలే! చూశావా, ఎలా కుదిరిందో?” షులాన్ వైపు అలాగే చూస్తు ఇంకా ఏదో కొద్ది అనుమానం వున్న ఆలోచనతో లేయూ తిరిగి అంది “వూ షులాన్ నాకంటే బలంగా పొడగరిగా వుంటుందని నాలో నేను పందెం వేసుకుని మరీ అనుకుంటుండేదాన్ని. కొంతమంది నువ్వు నాకంటే సొగసుగా వుంటావని చెప్పారు గానీ నేను నమ్మలేదు.” షులాన్ చిరునవ్వు చిందించి.. “ఝూంగ్ సోదరీ! నువ్వూ చాలా అందంగా వున్నావు” “నేనా, అందమా?” లేయూ ఉల్లాసంగా అని ఉపేక్షాభావంతో కన్నుగీటింది. మరుక్షణం గంభీరంగా అంది. “అమ్మ అనేది నేను పసిదానిగా వున్నప్పుడు అందంగా ఉండేదాన్నని. తర్వాత ఒక భూస్వామి ఇంట్లో చాలా సంవత్సరాలు బలవంతంగా బానిసగా వుండాల్సొచ్చింది. పెళ్లయిన తర్వాత పొలం దున్నడానికీ, బండి పనులు చూసుకోడానికీ మొరటువాడైన నా పెనిమిటితో వెళ్లిపోయాను. అలా కొద్దికొద్దిగా నా సౌకుమార్యమంతా జారిపోయింది.” “నా చిన్నతనం నుండీ నేను బైటికొచ్చి పొలం పనులు చేస్తూనే వున్నా” లేయూ పూర్తి సంతృప్తిని వెల్లడించి మళ్లీ అంది. “నువ్వేమిటి కొద్దిగా బిడియ పడ్తున్నట్లున్నావు? నువ్వు బైటికి రావడం ఇదే మొదటి సారా?” అవునన్నట్లు తలూపింది షులాన్. “ఇంతకీ నువ్వు పార్టీలో చేరావా? ” ఆదుర్దాగా అడిగింది లేయూ.

“లేదు... ఇంతవరకు చేరలేదు” సిగ్గుపడుతూ చెప్పింది షులాన్. “అరే- నువ్వింకా పార్టీలో చేరకపోవడమేమిటి?” కళ్లు విప్పార్చుకుని అపనమ్మకంగా చూస్తు “తొందరగా దరఖాస్తు చెయ్యి. ఇప్పుడు నాకర్థమైంది. పెద్దలంటుంటారే ‘మంచి ఇల్లాలు’ అని అదీ నువ్వు”.

○○○

వూ షులాన్‌ను ‘ఒక మంచి కోడలుగా’ గ్రామస్తులు మెచ్చుకునేవారు.‘ఒక మంచి కోడలు’ మెట్టినింటి బంధువులు గొప్పగా తలచేవారు.‘ఒక మంచి కోడలు’ భర్తస్నేహితులు అలా ఆమెను గౌరవించేవారు.అయితే, ఆమె భర్త ఆ పొగడ్తలన న్నింటిని వింటూ ఉండేవాడు. కానీ ఏమీ మాట్లాడేవాడు కాదు. అతను పార్టీలో సభ్యుడే కాకుండా మౌలిక స్థానంలో వున్న సమశక్తిమంతు లలో ఒకడు. అతను ఇంట్లో గడపదగిన సమయమంతా పార్టీ పనికే వినియోగించేవాడు. అయినా షులాన్ ఏనాడు ఈ విషయమై అభియోగం మోపుతూ మాట్లాడేదికాదు. ఎల్లవేళలా చిరునవ్వులు చిందిస్తూ ఇంటిపనులన్నీ తానే చేసుకునేది. ఒకసారి వాళ్లాయన వుండబట్టలేక “ఈ రాత్రి సామూహిక సమావేశం జరగబోతోంది. మరి, నువ్వు వస్తావా?” అని అడిగాడు. అందుకామె నవ్వుతూ మాట్లాడకుండా తన కుట్టుపని సామగ్రిని చేపట్టి, సాధారణంగా తాను ఎప్పుడూ కూర్చునే దీపం పక్కన చేరబడింది. కొంచెం సేపైన తర్వాత అతను రేపు పార్టీ శాఖా కార్యదర్శి ఒక నివేదికను చదవబోతున్నాడని చెప్తూ “ నువ్వు వచ్చి వినకూడదా?” అని అడిగాడు. అందుకామె యథావిథంగా నవ్వింది కానీ ఏమీ చెప్పలేదు. తర్వాతి రోజు ఆమె, మామూలుగా ఉతకడాని కుంచిన బట్టల తట్టను తీసుకుని బావికి వెళ్లిపోయింది. కొద్ది రోజుల తర్వాత అతను షులాన్‌తో “స్త్రీల అధ్యయన విభాగము అనే శాఖను గ్రామసభ ప్రారంభించబోతోంది, నువ్వెళ్లి నీ పేరును నమోదు చేసిరా!” అంటూ అది ఒక విధాయకం అన్నట్లు చెప్పాడు. ఆమె అందుకు గూడా నవ్వి మరేమీ మాట్లాడకుండా తలొంచుకుని మిగిలిన తన ఇంటి పనులను చేసుకుంటూ వుండిపోయింది. ఈ విధంగా అతను చాలాసార్లు ఆమెతో పార్టీ గురించి, సంఘ సమావేశాల గురించి చెప్తూనే ఉన్నాడు. ఆమె విస్మయంగా కళ్లను విప్పారుస్తూ అర్థం కానట్లు అమాయకంగా అతన్ని చూస్తు మృదువుగా “ఇప్పుడిలా వుండడంలో అంతా బాగానే వుంది కదా!” అనేది. ముఖం చిట్లించుకుని తలను అడ్డంగా వూపుతూ బలంగా నిట్టూర్చేవాడతను.

○○○

గ్రామంలో వ్యవసాయ సహకార సంఘాలను ఏర్పరిచిన తర్వాత షులాన్ మరో మహిళతో కలిసి పొలాల్లో పనిచేయడానికి వెళ్లింది. అక్కడ ఆమె గొప్ప ఉత్సాహంతో పని చేసింది. ఈ విషయంలో

వేరెవరినీ ఆమెతో సరిపోల్చడం కుదరదు. ఆమె అందరి పట్ల ఎప్పుడూ మంచిగా, నిష్కపటంగా వుండడంతో ఆమెనందరూ ఇష్టపడేవారు. ఆరు మాసాల్లో ఆమె, జట్టు ఉపనాయకురాలిగా ఎన్నుకోబడింది. జట్టు సమావేశం జరిగితే ఆమె వెళ్లకుండా వుండటం గానీ, ఆలస్యంగా వెళ్లడం గానీ చేసేది కాదు. అయితే ఏనాడు స్వరం విప్పి తన అభిప్రాయం వెలిబుచ్చేది కాదు. దాని బదులు, కుట్టు సామగ్రిని తనతో పట్టుకెళ్లి ఒక మూలన కూర్చుని చక్కని చిరునవ్వులు రువ్వుతూ చర్చలను వినేది.

గత శీతాకాలంలో గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఘోరమైన దగ్గు బాధలకు లోనై క్షయరోగుల్లా యాతనపడ్డారు. అంతా ఓ సుడిగాలి తీవ్రతలో గడపాల్సొచ్చింది. దానితో సహాయక చర్యల శిబిరం ప్రారంభించబడింది. క్రమంగా షులాన్ అందులోకి వెళ్లింది. ఆమెకిప్పుడు ఇంటి దగ్గర గడిపే సమయం తగ్గిపోయింది. తరచుగా సమావేశాలలో మాట్లాడుతుంది. ఇతరులతో హేతుబద్ధమైన తర్కం కూడా కొనసాగించేది. ఆమె కళ్లు ఇప్పుడు చిత్రమైన వెలుగుతో తళుకులీనుతున్నాయి. ఆమె పెదాలను నూతన చిరునవ్వులు ఆక్రమించుకున్నాయి. ఆమె భర్త తరచుగా అబ్బురంగా ఆమెనే చూస్తు 'ఈమెలో మార్పొచ్చింది అనుకునేవాడు' తనలో ఏదో మార్పొచ్చిందని ఆమెకీ తెలుస్తూనే వుంది. ఈ సమయంలోనే భయంకర యుద్ధనౌక ఝూంగ్ లేయూ యొక్క పేరు ప్రతిష్టలు జిల్లా అంతటా అల్లుకుంటున్నాయి. ఆమె నిర్వహణలోని ఉత్పత్తి జట్టువాళ్లు బావులు, కాలువలు తవ్వడం, ఎరువు కూడబెట్టడం పొలం దున్ని సేద్యం చేయడం లాంటి ఏ విషయంలోనైనా ప్రత్యర్థులను మించి పోటీలో నెగ్గాలనే తపనతో పనిచేయాలని ఎర్రజెండాని ప్రదర్శిస్తున్నారు. వూ షులాన్ పూర్తిగా తనతో పోటీ పోరాటంలోకి దిగిందనీ, షులాన్ జట్టుకు సంబంధించిన ప్రతి వ్యవసాయ పనిముట్టుపైనా ఝూంగ్ లేయూని మించి పోవాలి' అనే నినాదం అతికించి వుంచబడిందనీ ఒక వార్త విని వుంది. అదిప్పుడు నిక్కచ్చిగా సరిపోయింది. పది దినాలలో పోటీలో నెగ్గాలనే దీక్షతో నిర్వహించిన పనులలో ఎవరు గెలిచిందనేది నిర్ణయించేందుకు జరిపిన సమావేశంలో వూ షులాన్ జట్టు ఎర్రజెండాను స్వంతం చేసుకుంది. "ఏమిటి? వూ షులానా! నాకు చెప్పకండి. ఆమెకేమైనా మూడు తలలూ, ఆరు చేతులు వున్నాయా!" "ఆమె నీకంటే విలక్షణమైంది" "అలాగా చూస్తా! ఈ వూ షులాన్ తన చేతుల్ని ఏ మాత్రం పైకి మడవగలదో".

ooo

తర్వాత, ప్రాంతీయాధికారి డాన్గ్జియాంగ్ పట్టణంలో పత్తిపొలాల నిర్వహణ విషయమై ఒక అత్యవసర సమావేశం నిర్వహించాడు. అందులో పాల్గొనాల్సిందిగా ఈ ఇద్దరు మహిళలను పట్టణ పార్టీ కమిటీ పంపించింది. ఒకరికొకరు పరిచయమయ్యారు. మొదటి కలయికలోనే లేయూ వూ షులాన్ పట్ల గాఢమైన అనురక్తిని ఏర్పరచుకుంది. చిరునవ్వుల షులాన్‌ని చూస్తు లేయూ అభిలాష పూర్వకంగా అంది 'మా మంచి మహిళామణీ! అప్పుడే నీ పోకిళ్లన్నీ బైటబెట్టుకోకు. ఝూంగ్ లేయూని ఎదుర్కునేటప్పుడు శ్వాస పీల్చుకునే సమయం కూడా ఉండదు..." అలా మాట్లాడుతున్నంత సేపూ లేయూ షులాన్ భుజం మీద చేత్తో కొడుతూనే ఉంది. చిరునవ్వుల షులాన్ దానిని తమాషాగా తప్పించుకుంది. అదే సమయంలో 'అంతా వినండి' అనే పిలుపు వినిపించి కుదురుగా వినసాగారు. "ఇప్పుడు మనం ఒక వృద్ధురాలికి చెందిన ప్రయోగార్హమైన నేలచెలకను చూడటానికి గ్రామ ఉత్తరపుక్కకు వెళు తున్నాము. అంతా కలిసి నడవండి. ఎవరూ వెనకబడవద్దు." లీడరు సందేశాన్ననుసరించి అంతా లేచారు."పోదాం పద" అనుకుంటూ ఆ మహిళలిద్దరూ చేతులు కలుపుకుని రాదారి పైకి వచ్చి భుజంభుజం రాసుకుంటూ, అంగలు వేసుకుంటూ నడవసాగారు.

ooo

జట్ల చర్చల తర్వాత ఆ సాయంత్రం షులాన్ తనకిచ్చిన బసకు చేరింది. ఆ ఇంటి వాళ్ల చిన్నకుమార్తె కిరసనాయిలు దీపం వెలిగించి ఈమె కొరకు ఎదురుచూస్తు వుంది. ఆ అమ్మాయితో ముచ్చట్లయిన తర్వాత కొత్త పరిసరాలను, అనుకూలంగా వున్న గదినీ పరిశీలించి చూడగానే షులాన్ హృదయం, ఆనందంతో నిండిపోయింది. ఒక్కసారిగా తన భర్త సమావేశాలనీ, విధి నిర్వహణ సంచారాలనీ, ఇతర వ్యవహారాలనీ తరచూ బైటికి వెళ్లిపోయి పరిచయం లేని కొత్తవాళ్ల యిళ్లలో బసచేయడం గుర్తొచ్చింది. ఇప్పుడు తనకు స్వయంగా కొత్త వాళ్ల ఇళ్లల్లో గడపడం, ఇంటి వాళ్లను ఎంతో పరిచయమున్న తమ పక్కింటివాళ్లే అన్నంత ఆప్యాయతలను పొందడం ఒక కొత్త స్థితిగా అనుభవానికొచ్చింది. ఇంతలో పక్కచుట్ట చేతిలో పట్టుకుని ఝూంగ్ లేయూ దడాలున లోపలికి వచ్చింది. "మేమిద్దరం కలిసి వుంటామని నాయకుడికి చెప్పాలే! మరి నాకిక్కడ జాగా వుందా! నీతో ఇంకెవరున్నారు?" అంటే... "ఇదిగో ఈ చిన్న సోదరి మాత్రమే!" షులాన్ చెప్పింది. లేయూకి శ్రద్ధగా స్వాగతం పలుకుతూ ఆమె చేతిలోని పక్కచుట్టను కూడా మర్యాద పూర్వకంగా అందుకుంది. కాంగ్ (చైనా చెక్కమంచం) అంచున కుదురుగా కూలబడి షులాన్ మెడ చుట్టూ చేతులు వేసి కావిలించుకుని ఒకటే మాట్లాడటం ప్రారంభించింది లేయూ "వూ సోదరీ! మనం మంచి స్నేహితులులాగా వుందాం. క్రితం మగవాళ్లు ఎక్కడబడితే అక్కడ చొరవతో స్నేహితులను పొందేవారు. ఇప్పుడు మనం అంటే ఆడవాళ్లం అలాగే స్నేహాన్ని సంపాదించుకుంటున్నాం. సోదరి వూ! ఇది అద్భుతం అనిపించడం లేదూ?".

ooo

తర్వాత రోజు సాయంకాలం ఆ స్నేహితురాళ్లిద్దరూ తిరిగి తమ ఇళ్లకు ప్రయాణమయ్యారు. వాళ్ల జుట్టు, భుజాలు, కాలిజోళ్లు, మేజోళ్లు, పైజాకూ తొడిగిన కాళ్లూ పల్చటి పసుపు రంగు దుమ్ముపొర పేరుకుపోయి వున్నాయి. త్వరత్వరగా నడుస్తూనే, మాటిమాటికి తలెత్తి ఆకాశం వైపు దృష్టి సారిస్తూ, డాంగ్ జియాంగ్ పట్టణాన్ని ఎలా గొప్పగా తీర్చిదిద్దాలనే విషయం భావోద్వేగంగా చర్చించు కుంటున్నారు. ఇంతలో దట్టమైన బూడిదరంగు నీలిమేఘాలు ఆకాశాన్ని కప్పేశాయి. షులాన్ ఆత్రుతగా అంది "సోదరి! మనం తొందరగా నడవడం మంచిది. ఆగ్రహంగా వంగిన ఈ కారుమేఘం నమ్మడానికి వీల్లేనట్లుగా వుంది." "ఆ దానిముఖం!" తాను లెక్క చేయనన్నట్లుగా బిగ్గరగా అంది లేయూ. "ఒకవేళ వర్షం వస్తుందా, కురవనియ్యి కుంభవృష్టి" షులాన్ పెద్దగా నవ్వి "ఏయ్ ఝూంగ్ సోదరీ! నీకేమ్మా, దాదాపు ఇంటి దాపులకు వచ్చేశావు. కానీ, నేనింకా పది అంచె(వి)లు వెళ్లాల్సి వుంది. తెలుసా?" అంది. "అదిగో మళ్లీ" లేయూ చిరాకుపడింది. "నీకెన్నిసార్లు చెప్పాను? ఈ రాత్రి నువ్వు మా ఇంట్లో వుంటున్నావు అంతే! నువ్వు గనుక 'కాదు' అంటే నువ్వు నా మైత్రికి తగినదానివే కాదు" ఈ చివరి మాటను దృఢమైన భావంతో, గంభీరమైన కంఠస్వరంతో పలికింది. "అలాగైతే మటుకు మనం తొందరపడాలిగదా. లేకపోతే మునిగిపోతాం". దారి రెండువైపులా విశాలంగా విస్తరించివున్న పత్తిపొలాల నుండి చినుకులు పడ్తున్నట్లు టపటప మనే శబ్దం వినిపించింది. ఆ ఆడాళ్లిద్దరూ తమబట్టలపై పేరుకుని వున్న దుమ్మును చినుకులలో పోగొట్టుకోవడానికని ఆగారు. తలలను తుండు గుడ్డలలో చుట్టారు. ఆపైన పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ కలిసి నడుస్తున్నారు. గ్రామం పెద్ద దూరంలో లేదు. వూరి బైట ఒక వైపున్న పచ్చని చెట్ల తోపును మునిమాపు చీకట్లు కమ్మి వుండగా వాళ్ల ఎర్రజెండా మాత్రం ఎప్పటిలా వెలుగులీనుతోంది. బురదతో రాస్తా రొచ్చుగా మారిపోయింది. వాళ్లు గబగబా నడిచి గ్రామంలోకి ప్రవేశించారు. లేయూ, హుషారుగా షులాన్ చేయి పట్టుకుని నడిపిస్తూ లోకస్ట్ చెట్టు వెనక వున్న చిన్న ఇంటి ముందున్న జాగాలోకి వెళ్లింది. గుమ్మాన్ని సమీపించక ముందే బిగ్గరగా పిలుస్తూ "అమ్మా! రావాలి. మన ఘనమైన అతిథికి స్వాగతం పలకాలి" అంటూ కేక పెట్టింది. మొదటగా, లేయూని అందుకోవాలని పోటాపోటీగా దెబ్బలాడుకుంటూ కొందరు పిల్లలు పరుగెత్తు కొచ్చారు. అందరిలోకి చిన్నపిల్ల ముఖాన్ని ఆప్యాయంగా తన రెండు చేతులలోకి తీసుకుని తటాలున బుగ్గ మీద ముద్దిచ్చి ఆ తర్వాత మిగతా పిల్లల వీపులను నిమిరింది లేయూ. లేయూ

అత్తగారు బైటికొచ్చింది. బాగా ముడతలు పడిన ముఖ భాగాన్ని బిగదీసి కట్టింది. అతిథి వైపు సఖ్యతగా చూసింది. "మీరు ఈ దిక్కుమాలిన కుండపోత వర్షం నుండి దారిలో ఏదైనా రక్షణ వెతుక్కుని ఆగిపోవలసింది. చూడు.. అయ్యయ్యో! తడితో నానిపోయారు. త్వరగా పదండి!" అంది. "ఈ మధ్యన ఈమె గురించి చాలా చెప్పాను. ఈమె న్యానర్ సహకార సంగం నుంచి వచ్చింది" వూను పరిచయం చేసింది లేయూ. పెద్దామె కొంచెం సేపు ఆలోచించింది. తటాలున గుర్తొచ్చినట్లు "ఓహో, నాకు తెలిసింది. బహుశా ఈమె వూ షలాన్ అయి వుండాలి." అంది."అవును పెద్దమ్మా! నువ్వు సరిగ్గానే వూహించావు." షలాన్ చిరునవ్వుతో అంది. ఆ సమయంలో విశాలమైన నుదురు గంభీరమైన చూపులతో దాదాపు ముప్పైల పైన వయసున్న వ్యక్తి పెద్ద అంగలతో లోపలికి వచ్చి తన గడ్డి టోపీని తీసేశాడు. క్రితం పట్టణ ప్రాంతంలో షలాన్ అతనిని చూసింది. కానీ, అతనే లేయూ భర్త అని ఎప్పుడూ వూహించలేదు. షలాన్‌ని చూస్తూనే అతనన్నాడు. "చాలా దూరం నుండి చూసే లేయూ పక్కన ఎవరో వున్నారు. అది కచ్చితంగా నువ్వే అయివుంటావనుకున్నా! నిన్ను కలుసుకోవడం దివ్యంగా వుంది. మా న్యాన్సీ సహకార సంస్థని జయించిన మహిళ నిజానికెవరో చూడాలని మేమంతా ఆశించాం." "అధిక వాగుడు కట్టిపెట్టు" లేయూ చిరచిరలాడింది.. "మేమిక్కడ తడి బట్టలతో నానిపోతున్నాం. వెళ్లు, వెళ్లి కొద్దిగా నిప్పు రాజెయ్యి, ఆరబెట్టుకుంటాం." "సరే, ఇదిగో ఇప్పుడే వెళ్తున్నా" అంటూ కదిలాడతను. షలాన్ లేయూ వైపు ఆశ్చర్యంగా చూస్తుంటే, ఆమె కొంటెగా కన్ను గీటుతూ "అదీ వరస, చూశావా అతనెలా నా మాట వింటూనే ఆచరణలో పెడుతున్నాడో?" అంది."షలాన్, పార్టీలో చేరేందుకు పూచీదారునెవరినైనా సిద్ధం చేసుకున్నావా?" షలాన్‌ని అడుగుతూనే లేయూ తన సమాధానం కోసం ఆగకుండా, ఒక వీరావేశంతో భర్తతో అంది "పోనీ మనమే ఆమెకి జవాబుదారులుగా వుందాం. ఏం కామ్రేడ్ షలాన్! అదే మంచి ఆలోచన కదూ, ఏమంటావ్?""అప్పుడు నేను నిశ్చితంగా వుంటా" షలాన్ ఆనందంగా అంది. పెద్దామె తేనీరు తీసుకుని వచ్చింది. అతిథితో వున్నంత సేపూ ఆమెనీ, ఈ కాలం యువతుల్నీ ఒకటే మెచ్చుకుంటూ మాట్లాడింది. "ఎంత ఉల్లాసంగా వున్నారమ్మా మీరంతానూ. ఎక్కడి కంటే అక్కడికి వెళ్లిపోతారు. అంతటా స్నేహితుల్ని సంపాదించుకుంటారు. ఎందుకూ కొరగాని కొందరు మగాళ్లు ఏమాత్రం మిమ్మల్ని అందుకోలేరు." అంటూ ఆమె కోడల్ని మెచ్చుకుంది. "మామూలు మగాళ్లు నలుగురైదుగురు ఏకమైనా మా లేయూకి సమానం కాలేరు. ప్రతి విషయాన్ని వూరక గొడవలోకి మారుస్తుందనుకోకు. ఆమె తన మనసులో ఎంతో న్యాయబద్ధంగా వేరెవరూ వేలెత్తి చూపని విధంగా వుంటుంది. చుట్టుపక్కలవాళ్లు అంటుంటారు 'మామ్మ' ఆమె నీ కోడల్లాగా కాదమ్మా, స్వంత కూతురు మాదిరి నడుచుకుంటుంది' అని"."ఈ గడపలో అడుగుపెడ్తూనే నేనది గమనించా పెద్దమ్మా! మీ కుటుంబం అద్భుతం!" షలాన్ చిరునవ్వుతో అంది. ఆ సాయంత్రం ఆమె తిరిగి ఇంటికి వెళ్లిపోయి తన జట్టు సభ్యులందరినీ సమావేశపరిచి డాంగ్జీయాంగ్ పట్టణంలోనూ, లేయూ సహకార సంస్థలోనూ తాను ఆకళింపు చేసుకున్నదంతా వెంటనే వాళ్లకి విశదపరిచాలని వూ ఆలోచిస్తోంది. ఆమెలోని వ్యాకులపాటు మిక్కుటమవుతోంది. కారణం వర్షం వేగాన్ని కూడదీసుకుంటుందనేది ఒకటి, రెండోది

లేయూ ఇంతవరకూ తిరిగి రాలేదనేది. అనుకోకుండా రేకు పెట్టె మీద ఏదో జండాలాంటిది కనిపించి వెంటనే వెళ్లి మడత విప్పి పరిచింది షలాన్. అది పసుపుపచ్చని జెండా! దానికి ద్వితీయం (రన్నర్ అప్) అనే పదం జత చేయబడి వుంది. అది తనకు చాలా పరిచయమైనదే! నింగినేల ఏకం చేసి తాను ఆ జెండాను లేయూ చేతికి వెళ్లేలా చేసేంత వరకూ అది తన సహకార సంస్థలో వేళ్లాడుతూ వుండేది.

ఆ సమయంలో లేయూ కొందరు ఆడవాళ్ల గుంపును వెంటేసుకుని వచ్చింది. వాళ్లంతా షలాన్‌ని చూడాలని వచ్చారు. వాళ్ల రాకతో ఆ గదికి జీవం వచ్చింది. లేయూ గదంతా మసకగా వుండడం చూసి గొణుగుతూ దీపం వెలిగించింది. తర్వాత, తనతో వచ్చిన వాళ్లందరినీ ఒకరి వెంట ఒకరిని షలాన్‌కి పరిచయం చేసింది. అన్నిటా లేయూకున్న సహజ వేగానికి తోడు చురుకైన దృష్టి కూడా వుంది. క్షణంలో ఆమె.. షలాన్ బట్టలు మార్చుకుని, సామాను సర్దుకుని ఇక బైట పడాలనే విషయమై అసహనాన్ని ముఖంపై పులుముకుని సిద్ధంగా వున్నట్లు గమనించింది. ఈ భావనే లేయూకి భరింప శక్యం కాదు. అందుకే వెంటనే ఓ ప్రతిపాదన చేసింది. "మనమంతా కుదురుగా కూర్చుని.. ఇప్పుడు కామ్రేడ్ షలాన్ తన అనుభవాలను తెలియజేస్తుంది.. విందాం! ఎవరూ కూడా పోటీకి సంబంధించిన ఏ విషయమూ అనకూడదు. ఉదహరించకూడదు. సరేనా?" అని జట్టుకు చెప్పింది. అంతా అంగీకరించారు. ఆహ్వానం లాంటి ఆ ప్రతిపాదనను షలాన్ కాదనలేకపోయింది. అయితే, ఒకరికొకరం అనుభవాలను పంచుకుందామనే సూచన చేసింది. లేయూ అంగీకరించింది. ఆ పైన పత్తి విత్తడం గురించి వాడి వేడి చర్చ జరిగింది. చివరలో షలాన్ తన కనుకొలకుల చివర్ల నుండి లేయూని ఓరగా చూస్తు ఏకపక్షదాడిని ప్రారంభించింది. "ఇంత హడావుడిగా ఈ సమావేశం జరపడంలో మీ తక్షణ పథకం ఏమిటి?" మహిళా సమూహాన్ని అడిగింది. "షలాన్ పెద్దక్కా! మా ఆలోచనొక్కటే. అది నిన్నెలా అధిగమించాలా అనే!" ఒక దుందుడుకు యువతి అనాలోచితంగా చెప్పింది. "అలాగా! మరి అది ఏ విధానంలో వుండాలని సమ్మతించుకున్నారు?" షలాన్ ఆ బాలికనడిగింది కుతూహలంగా. మిగతావాళ్లు ఆ యువతికి సైగలు చేస్తుంటే.. లేయూ ఆ పిల్ల దూడుకును ఆపడానికి ప్రయత్నిస్తోంది. "షలాన్ పెద్దక్కా నువ్వు ఎర్రజెండాను లాగేసుకుని ప్రతిగా ఆ పాత పసుపు జెండాను మాకిచ్చావు. మేము దాన్ని అంతటితో విడిచిపెట్టం. నీ నుండి అంతా నేర్చుకుని నిన్ను మించిపోవాలని అనుకుంటున్నాం." "అహా! అలాగా? అయితే మీరు మమ్మల్ని జయిస్తామంటారు!""మా ప్రయత్నం అదే!" ఆ యువతి పెడసరంగా అంది. "సరే, మంచిదే! మరి ప్రయత్నించండి." నవ్వుతూ లేచి నిలబడింది షలాన్. బైటికి ప్రశాంతంగా, సౌమ్యంగా కనిపించే ఆమె కళ్లలోతుల నుండి ఆమె నిశ్చయ దృఢత్వపు మెరుపు తళతళలు కనిపించాయి. లేయూ నవ్వుతూ అంది "అలాంటి మాటలొద్దు, అర్థమైందా? మళ్లీ అలాంటి మాటలనే కొనసాగించారంటే సోదరికి విశ్రాంతి లేకుండా చేసినట్లే! ఈ రోజు ఆమె మన అతిథి గదా!" "నేను విశ్రాంతిని పొందే వున్నాలే!" వుల్లాసంగా చెప్పి, రేకుపెట్టె పైన వున్న జెండాను చూపిస్తూ షలాన్ అడిగింది. "ఝూంగ్ సోదరీ! ఆ జెండాని అక్కడెందుకు వుంచారు?" "ఎందుకంటే మేము త్వరలో దాన్ని తిరిగి ఇవ్వబోతున్నాం" లేయూ. "ఎవరికి ?" షలాన్. ఆమె నేరుగా తననీ వివాదంలోకి లాగుతుందని తెలుసుకున్న తర్వాత లేయూ కొద్ది క్షణాలు సంశయించింది. తర్వాత,

తాను నడిపిన తతంగానికి లోలోపల గర్వంగా నవ్వుకుని "ఇదిగో వూ సోదరీ! నేను దాన్ని ఎవరికి తిరిగి ఇస్తానని అనుకుంటున్నావు? కచ్చితంగా దాన్ని నేను ఏ నల్లసిద్ధికో బదులు మారకం చేయను" అంది. "మరి అలాంటప్పుడు దాన్ని ఎంచక్కా వేళ్లాడదీయవచ్చుగా?" "అది నిర్ణయించాల్సింది నువ్వు కాదు""నేను కాకుంటే మరెవరు?" ఆత్మవిశ్వాసంతో అంది షులాన్. "మేమిక్కడున్నాం, మరిచిపోయావా?" లేయూకీ గర్వం వచ్చింది. షులాన్ తన సంచీ, సరంజామా అందుకుని, పళ్లు కనిపించేలా పొడిగా నవ్వుతూ "సరే, ఝూంగ్ సోదరీ! మీకిష్టమైనట్లు అనుకోండి. నేను వెళ్లిపోతున్నా! మార్పిడికి మా జట్టువాళ్లు అంగీకరిస్తారో లేదో అడుగుతా!" పోటీదారులను మించాలనే ఇచ్ఛతో ఎన్నోదినాలు అహరహం తన జట్టు నేస్తాలను తోడ్కొని పొలాలకడ్డం బడి ఎగురుతూ తిరుగుతూ ఎంతో కృషి చేయబట్టే షులాన్ హృదయం ఘనంగా ఉప్పొంగేలా నిలబడగలిగిందిప్పుడు. లేయూ, ఆమె నేస్తాలూ ఎంతగా చెల్లించినా, బుజ్జగించినా షులాన్ ఇంటికి వెళ్లిపోవడానికే నిశ్చయించుకుంది. చివరికి "నిజానికి నువ్వు చాలా చెడ్డమొండి మహిళవని నాకిప్పుడర్థమైంది." అంటూ గొణుగుళ్లతో మెత్తని చీవాట్లను మాత్రం పెట్టగలిగింది లేయూ. వాళ్లిద్దరూ ఒకే ఒక్క రోజులో కలుసుకోవడం, తెలుసుకోవడం జరిగినప్పటికి వాళ్ల స్నేహం మాత్రం ఘనమైందీ, నిష్కపటంతో కూడుకున్నది. వూ షులాన్ నిష్ప్రయోజన కరంగా ఇలా ఈ రాత్రి తనవాళ్లకు దూరంగా వున్నందు వల్ల కలిగే నష్టాన్ని పూడ్చుకోవడం చాలా కష్టతరం. లేయూ దీనినర్థం చేసుకుంది. లేకుంటే వాళ్లిద్దరూ అలాంటి మంచి నేస్తాలుగా అయ్యేవారుకాదు. షులాన్ వెళ్లిపోవడానికి కదలగానే లేయూ "సరే పద! చీకటి ముదురుతోంది. దారి బురదతో జర్రున జారుతోంది.." అని, మరేమీ మాట్లాడలేకపోయింది. "గ్జీయింగ్! నాతో రా, వూ సోదరి తన ఇంటికి వెళ్లే మార్గం వరకూ వెళ్లొద్దాం.!" అంటూ తాను కదిలింది. షులాన్ ఇలా వాళ్లు తనవెంట రావడాన్ని వద్దనలేకపోయింది.

లేయూ అత్త ఇరుగు-పొరుగు ఇళ్ల నుండి గొడుగులూ, లేయూ, గ్జీయింగ్ జాగ్రత్తగా తిరిగిరావడానికని ఒక చిన్న లాంతరు దీపమూ తెచ్చిఇచ్చింది. గ్రామం బైట విశాలంగా పొలాలు కనిపిస్తున్నాయి. కానీ మసకమసకగా ఉంది. చుట్టుపక్కల గ్రామాలు సందె చీకట్లోనే గాఢాంధకారంగా కమ్ముకున్న వర్షపు తెర వెనక పూర్తిగా గుర్తించలేని విధంగా ఉన్నాయి. అయినా పొలాల్లో అక్కడక్కడా ఉత్పాదక జట్లు పనిచేస్తూనే ఉన్నాయి. స్నేహితురాళ్లు ముగ్గురూ గొడుగు పట్టుకుని ఆ బురద రాస్తా మీద ఒకరికొకరు ఆధారపడుతూ జారుడు బండ మీద జారుతున్నట్లు ముందుకు సాగారు. నడుస్తూనే వాళ్ల వాద ప్రతివాదాలు కొనసాగించారు. వీరావేశంతో దృఢంగా వెలువడుతున్న వాళ్ల కంఠ ధ్వనులు పొలాల గుండా దూసుకుపోతూ, నింగి నేలలను ఏకం చేస్తున్న గాలివానలా ఘర్జనలు వెనక్కి నొక్కేస్తున్నాయి. "ఝూంగ్ సోదరీ! మనం వెళ్తున్న దారిలో వున్న మీ పత్తిపొలాలను చూద్దాం పద! మళ్లీ నేను రావడానికి మరొక అవకాశం కలగడం అంత తేలిక కాదు గదా!" షులాన్ ప్రేరేపిస్తూ అడిగింది. "అబ్బో! అవి మన దారికి చాలా దూరమే!" అంది లేయూ. "అయితే ఏమిటి?" షులాన్ కరాఖండిగా అడిగింది. లేయూ ఆమె కోర్కెను అంగీకరిస్తూ "సరే పద అయితే ఒక్కటి నా కోరిక దీనిపై మీ వ్యాఖ్యానాలు మాకు కావాలి" అంటూ "ఇప్పుడు పశ్చిమానికి తిరగండి! గ్జీయింగ్! నువ్వు దారి తీయ్" దారి మార్చింది. వాళ్లు ముగ్గురూ నడుస్తున్న రాస్తాను వదిలి, సన్నని జారుడు బాటకు మరలి లేయూ సంస్థకు సంబంధించిన ఉత్తమ దిగుబడి పత్తిపొలాల వైపు నడుస్తూ మాట్లాడుకుంటూ, నవ్వుతూ, తుళ్లుతూ, పరిశీలిస్తూ అడుగులు వేస్తున్నారు. ★

పెన్సిల్ చిత్రాలట!

ఇవి బ్లాక్ అండ్ వైట్ ఛాయాచిత్రాలు కానే కావు. పోనీ రంగు ఫొటోలే ఇలా నలుపు తెలుపుల్లోను కనిపించడం లేదు. ఇవి అచ్చంగా చేతితో గీసిన పొర్ట్రెయిట్‌లు. పెన్సిల్ వాడి వేసిన హైపర్ రియలిస్టిక్ డ్రాయింగ్స్. నైజీరియాకు చెందిన అరింజె స్టాన్లీ మోనోక్రోమ్ పెన్సిల్‌తో వీటిని గీశాడు. ఒక్కో చిత్రానికి వంద గంటలకు పైగా సమయం పట్టిందంటే ఎంత ఓర్పుగా, నేర్పుగా చిత్రించాడో అర్థమవు తుంది. చాలామంది వీటిని చూసి ఇదేదో ట్రిక్కుతో వేసినవి... నిజంగా సాధ్యం కాదంటే పీస్-బై-పీస్ తాను ఎలా ఈ చిత్రాల్ని కేన్వాస్ ఎక్కించాడో చూపించాడు. అయినా నమ్మలేక ఒకసారి తీక్షణంగా చూసి ఆశ్చర్యపోతున్నారు. ముఖం మీద పడే నీటి ధార నుంచి కళ్లలోని వెలుగు వరకు ప్రతి డిటైల్‌లో ఎక్కడా లోపం లేకుండా అసహజంగా అనిపించకుండా కృత్రిమం కనిపించకుండా ఇంత రియలిస్టిక్‌గా డ్రాయింగ్ గీయడ మంటే మామూలు విషయం కాదు. వాహ్ అరింజె... వాహ్..! ★





అనంత కమ్యూనిస్టు యోధులు

1980 దశకంలో ఆనాటి కమ్యూనిస్టు పార్టీల కార్యదర్శులకు నేను తరచూ ఒక విషయంపైన ఉత్తరాలు రాసేవాణ్ణి. రాష్ట్ర కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర సమగ్రంగా రాయటం సాధ్యం కాకపోవచ్చునని కనుక జిల్లాల వారీగా అమరవీరుల చరిత్రలు, నాయకుల స్వీయ చరిత్రలు రాయించమని అభ్యర్థించేవాణ్ణి. వాటి గురించి చర్చించారో, కాకతాళీయమో తెలియదు కాని ఆ తర్వాత కాలంలో నేను ప్రస్థావించిన విషయాలపై చాలా కృషి జరగి సాహిత్యం వెలువడింది. కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర ప్రథమ సంపుటి వెలువరించి చనిపోయారు.

"స్వీయ చరిత్ర", "ఆత్మకథ"(ఆటో బయోగ్రఫీ)ల పేరుతో రాయటానికి ఇష్టపడకపోయినా అనుభవాలు-జ్ఞాపకాలు పేరుతోనైనా పుచ్చలపల్లి సుందరయ్య, మోటూరి హనుమంతరావు, బాలగంగాధరరావు, ఆరుట్ల, యస్.వి.కె.దంపతులు, కొల్లా వెంకయ్య, తెలకపల్లి నర్సింహయ్య, కొండ్రగుంట వెంకటేశ్వర్లు, పోపూరి రామారావు, సింహాద్రి శివారెడ్డి, నల్లా నర్సింహులు, టి.వి.ఆర్ చంద్రం, వై.విజయ్‌కుమార్, కొండపల్లి కోటేశ్వరమ్మ, నాగళ్ల రాజేశ్వరమ్మ చల్లపల్లి శ్రీనివాసరావు, వంక సత్య నారాయణ తదితరులు రాసిన వారివారి జ్ఞాపకాలు కొంత చరిత్రని నిక్షిప్తం చేయగలుగుతాయి.

దీనికి తోడు సి.పి.యం పార్టీ కొన్ని జిల్లాల కమిటీలు ఆయా జిల్లాల్లోని అమరవీరుల-కమ్యూనిస్టు యోధుల చరిత్రలు ప్రచురించాయి. పశ్చిమగోదావరి, ఖమ్మం, నల్గొండ, ప్రకాశం, నెల్లూరు, కృష్ణ, గుంటూరు, కర్నూలు జిల్లాల నుండి అలా అమరుల చరిత్రలు వెలువడ్డాయి. తాజాగా అనంతపురం జిల్లా నుండి "కమ్యూనిస్టు ఉద్యమంలో అనంతపురం జిల్లా యోధులు" పేరుతో ఇటీవల (డిశెంబరు 2016) ఒక ప్రచురణ తెచ్చారు. జిల్లాకు చెందిన 142 మంది యోధుల సంక్షిప్త జీవితాల్ని కాగితాలపైకెక్కించడంతోపాటు, జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ ప్రారంభంలో జిల్లాపై ఇచ్చిన సంక్షిప్త వ్యాసం జిల్లా ఉద్యమాన్ని సమగ్రంగానే పాఠకుల దృష్టికి తెచ్చింది.

ఈ పుస్తకం ప్రచురణకు ముందు సి.పి.యం అనంతపురం జిల్లా కమిటి అనంతపురం జిల్లా అమరవీరుల కుటుంబాలతో ఒక ఆత్మీయ కలయిక ఏర్పాటు చేసింది(2015). ఆ సమావేశం ఆ జిల్లాలోని ఉద్యమానికే కాక చాలారోజుల నుండి ఉద్యమానికి దూరంగావున్న శ్రేయోభిలాషుల్లో కూడా చాలా స్ఫూర్తి నింపింది. ఒకే సంవత్సరం (2016) నాలుగు ముద్రణలు పొంది రికార్డు స్థాయిలో (8 వేల పుస్తకాలు) అమ్మకాలు కాబడిన "ప్రజాసేవలో తరిమెల నాగిరెడ్డి" పుస్తకాన్ని నేను ప్రచురించడానికి కూడా మార్గం సుగమం చేసింది.

"కమ్యూనిస్టులు తెలుగు ప్రజలను చైతన్యవంతం చేయటంలోనూ, ఆధునిక జాతిగా తీర్చిదిద్దటంలోనూ గొప్ప పాత్రను నిర్వహించారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక జీవితాన్ని ప్రభావితం చేశారు. చిరస్థాయిగా నిల్చిపోగల అంశాలను తెలుగు ప్రజలకు అందించారు. ఈ కృషికోసం అశేష త్యాగాలు చేశారు" అంటూ సి.పి.యం పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు బి.వి రాఘవులు ముందు మాటలో రాసిన విష్యయాన్ని ఈ పుస్తకంలోని 142 మంది వీరుల చరిత్ర ఋజువుచేస్తుంది. "మట్టి నుండి మాణిక్యాలను సృష్టించి, జిల్లా సాంఘిక, రాజకీయ, ఆర్థిక అంశాలను ఎంతగానో ప్రభావితం చేసిన ఘనమైన చరిత్ర కమ్యూనిస్టు ఉద్యమానిది" అని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాంభూపాల్ గారు రాసుకున్నారు. నిజమే మాణిక్యాలను సృష్టించిన ఘనత కమ్యూనిస్టు ఉద్యమానిదేగాని వాటిని భూగర్భంలో కలిసిపోకుండా వెలికి తీయటం రాంభూపాల్ లాంటి కార్యకర్తల బాధ్యత. దాన్ని సమర్ధవంతంగా నిర్వహించారు.

1930 దశకంలో కమ్యూనిస్టు భావాలు అనంతపురం జిల్లాలో ప్రసరించినా దానికో నిర్మాణరూపం రావటం మాత్రం 1943లో జరిగింది. స్వాతంత్ర్య ఉద్యమంతో మమేకమై సాగిన ప్రస్థానం నీలం రాజశేఖరరెడ్డి, కార్యదర్శిగా తరిమెల నాగిరెడ్డి, విద్వాన్ విశ్వం, వి.కె. ఆదినారాయణ, ఐదుకళ్ళ సదాశివన్‌లతో కూడిన జిల్లాకమిటి ఏర్పడింది. ఈ తొలి సమావేశానికి సుందరయ్యగారు హాజరయ్యారు(1943 జనవరి). బెనారస్‌లో విద్యాభ్యాసం ముగించుకుని తరిమెల నాగిరెడ్డి, విశ్వంలు రావటంతో జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఒక ఊపువచ్చింది. 1952 ఎన్నికల్లో తన బావ సంజీవరెడ్డిపై నాగిరెడ్డి గెలవటంతోపాటు నల్లమడ సీటు కూడా పార్టీ వశం కావటంతో ఉద్యమానికి మరింత ఉత్సాహం వచ్చింది. తర్వాత పుష్కరకాలం నాటకి దాని అభివృద్ధి అప్రతిహతంగా సాగింది. ఈ క్రమంలోనే పుస్తకంలో ప్రచురించబడిన 142 మంది యోధుల్లో ఎక్కువమంది పార్టీలోకి వచ్చి జిల్లాలోని పేద ప్రజలకు అండగా నిలిచారు. అనేక కష్టానష్టాలను ఎదుర్కొని త్యాగాలే తమ జీవన విధానంగా చాటారు.

1967 ఎన్నికలు సందర్భంగా కూడా అనంతపురం జిల్లా నాయకత్వమంతా తమవైపే ఉండగా ఒక్క నాగిరెడ్డ ఏం



పుస్తకంపేరు : అనంత కమ్యూనిస్లు యోధులు
పేజీలు : 328
వెల :150/-
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌసు అన్ని బ్రాంచీల్లో

చేస్తాగనే అహంకారంతో ఉమ్మడి పోటీకి చర్చలు సాగుతున్న సమయంలోనే సి.పి.ఐ నాయకత్వం అనుకున అన్ని స్థానాలకు తమ అభ్యర్థుల్ని ప్రకటించింది. గత్యంతరంలేని స్థితిలో పోటీకి దిగిన సి.పి.యం.కు అనంతపురంలో విజయం దక్కగా సింగనమల, కదిరిల్లో స్వల్ప తేడాతో ఓటమి ఎదురైంది. సి.సి.ఐ పోటీచేసిన అన్ని స్థానాల్లోనూ ఓడిపోవటమేగాక నీలం రాజశేఖరరెడ్డిలాంటి అగ్రనాయకుడు మూడో స్థానానికి పరిమితమయ్యాడు. ఐక్యంగా పోటీచేసివుంటే అనంతపురం, సింగనమల, కదిరి, గుత్తి, ఉరవకొండ స్థానాలతోపాటు అనంతపురం పార్లమెంటు స్థానానికి సదాశివన్‌గారు సునాయాసంగా గెల్చివుండేవారు. ఈ పుస్తకంలో పార్వతమ్మ, ఓబులమ్మ, రాజమ్మ, నాగమ్మ, రాయమ్మ, బీమక్క, కళావత్ముల గూర్చి వారి వీరోచిన త్యాగపూరిత కార్యకలాపాలగూర్చి ప్రస్తావించినా ఇందులో పేర్కొన్న చాలామంది అమరుల భార్యలు-పార్టీ సభ్యులు కాకపోయినా -అందించిన సహకారం, కార్యకర్తలపట్ల చూపిన ఆదరణ, అజ్ఞాత నాయకుల రక్షణకోసం పడిన యాతన అత్యంత శ్లాఘనీయాలు.

దీర్ఘకాలం లీడింగ్ న్యాయవాదిగా పనిచేసి చనిపోయేముందు పూరి గుడిసెలోవున రవూఫ్ సార్ జీవితం, కారణాంతరాలవలన కమ్యూనిస్టుపార్టీని వీడి కాంగ్రెసులోచేరి మంత్రిపదవిని స్వీకరించినా నిజాంవలి పూరిగుడిసెకే పరిమితమవ్వటం, పెళ్లయిన కొద్దినెలలకే వితంతువులుగా మారినా పార్వతమ్మ, నాగమ్మలు, కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమయ్యి శేషజీవితాన్ని సాగించటం చాలా విలువైన విషయం.

-చెరుకూరి సత్యనారాయణ

పుచ్చకాయ సోడా

కావాల్సిన పదార్థాలు



పుచ్చకాయ ముక్కలు- 5 కప్పులు
నీరు-2 కప్పులు
సోడా -1లీటర్
ఐస్ ముక్కలు-సరిపడా
సిరప్ కోసం
పంచదార-1/2 కప్పు
నీరు-1/4 కప్పు
నిమ్మరసం- 1/4 కప్పు
నిమ్మకాయ పైతోలు- 4 ముక్కలు

తయారుచేసే విధానం

సిరప్ తయారీ కోసం ముందుగా స్టౌవ్‌పై పాన్ పెట్టి అందులో పంచదార, నీరు, నిమ్మరసం, నిమ్మకాయపైతోలు వేసి బాగా మరగనివ్వాలి. మీడియం సైజ్ జార్ తీసుకుని గింజలు తీసేసిన పుచ్చకాయ ముక్కలు, ఐస్ ముక్కల్ని వేసి బ్లెండ్ చేసుకుని పక్కన పెట్టుకోవాలి. పంచదార పూర్తిగా కరిగిన తర్వాత స్టౌ పైనుంచి పాన్‌ను దింపి సిరప్‌ని పూర్తిగా చల్లారనివ్వాలి. ఇప్పుడు ఒక పొడవాటి జార్‌లో పుచ్చకాయ రసం, సోడా, నిమ్మ సిరప్, ఐస్ ముక్కల్ని వేసి బాగా కలుపుకోవాలి. సర్వింగ్ గ్లాసుల్లో సోడా మిశ్రమాన్ని పోసి నిమ్మకాయ పైతోలుతో గార్నిష్ చేసి అతిథులకందించండి.

గ్రీన్‌టీ నిమ్మ సోడా

గ్రీన్‌టీ బ్యాగ్స్-8
తేనె-3 టేబుల్ స్పూన్లు
స్ట్రాబెర్రీ ముక్కలు -2 కప్పులు
పుదీనా ఆకులు-10
నిమ్మకాయ ముక్కలు(గుండ్రంగా తరిగినవి)-4
నీరు-4 కప్పులు
సోడా -1లీటర్

తయారుచేసే విధానం

ముందుగా మందపాటి పాన్ తీసుకుని అందులో నీరు పోసి మరిగించాలి. అందులో నాలుగు నిమిషాలపాటు గ్రీన్ టీ బ్యాగ్స్‌ని వుంచి వాటిని తీసేసి పాన్‌పై మూత పెట్టాలి. మూడు నిమిషాల పాటు ఈ మిశ్రమాన్ని మరగనిచ్చి స్టౌపై నుంచి పాన్‌ను దింపి పూర్తిగా చల్లారనివ్వాలి. ఇప్పుడు ఒక జార్‌లో సోడా, చల్లారిన గ్రీన్ టీ, స్ట్రాబెర్రీ ముక్కలు, తేనె వేసి బాగా కలుపుకోవాలి. సర్వింగ్ గ్లాసుల్లో గ్రీన్ టీ సోడాని పోసి పుదీనా, నిమ్మకాయ ఐస్ ముక్కలు వేసి గార్నిష్‌చేసి అతిథులకు అందించండి.



కమలా సోడా

కావాల్సిన పదార్థాలు

కమలాపళ్లు-3
పంచదార-2 కప్పులు
నీరు- 2 కప్పులు
అల్లం ముక్కలు (అంగుళంసైజ్)-8
పుదీనా ఆకులు- గుప్పెడు
సోడా-1లీటర్

తయారుచేసే విధానం

ముందుగా పీలర్‌తో కమలా పళ్ల పైతోలు తీసి ఒక ప్లేట్‌లో వుంచాలి. (తోలు లోపలవైపు వుండే తెలుపు భాగం రాకూడదు). ఒక బౌల్‌లో కమలా పళ్ల జ్యూస్ తీసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టౌపై పాన్‌పెట్టి అందులో నీరు, కమలా పళ్లరసం, పంచదార వేసి మరగనివ్వాలి. పంచదార కరిగిన తర్వాత అల్లం ముక్కలు, కమలాపైతోలు, పుదీనా ఆకులు కూడా వేసి మరికొంతసేపు మరగనివ్వాలి.10 నిమిషాల తర్వాత స్టౌపై నుంచి పాన్‌ని దింపేయాలి. సిరప్ పూర్తిగా చల్లారిన తర్వాత వడగట్టి ఒక సీసాలో పోసి మూతపెట్టాలి. ఈ సిరప్‌ని వారం రోజుల దాకా వాడుకోవచ్చు. ఇప్పుడు ఒక పొడవాటి జార్‌లో పావు వంతు ఐస్‌ముక్కలని వుంచాలి. ఇందులో సోడా కమలా, అల్లం సిరప్‌ని వేసి బాగా కలపాలి. చివరగా సర్వింగ్ గ్లాసుల్లో ఈ మిశ్రమాన్ని పోసి పుదీనా ఆకులతో గార్నిష్ చేస్తే కమలా సోడా రెడీ!.



బాల నేస్తాలు

లిటిల్ స్టార్



హాయ్ ఫ్రెండ్స్! నేనొక స్టార్‌ని. ఇది నా చిన్ననాటి ఫొటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

జ: సాయి ధరమ్ తేజ్

బొమ్మ పూరిద్దాం



పిల్లలూ మీ కోసం ఆర్టిస్ట్ అంకుల్ ముందుగా సీతాకోక చిలుక బొమ్మని సగం గీసి వుంచాడు. మీరు మిగిలిన భాగాన్ని జాగ్రత్తగా పూర్తిచేయండే!

ఆకులతో బొమ్మ

మనింటి ముందు రాలి పడుతుండే ఎండుటాకులు, పచ్చి ఆకులతో పక్షి బొమ్మ ఎలా చేయచ్చో ఇక్కడ ఇచ్చాం! దాన్ని గమనించి మీరూ ప్రయత్నించండి!

తేడాలు కనిపెట్టండి

ఈ రెండు బొమ్మల్లో పది తేడాలు ఉన్నాయి. వాటిని మీరు గుర్తించి సున్నాచుట్టేయండి.

ఏమిటది

చూస్తే చూస్తుంది కానీ కళ్లు లేవు... నవ్వితే నవ్వుతుంది కానీ పళ్లు, నోరు లేవు.... తంతే తంతుంది గానీ కాళ్లు, చేతులు లేవు... ఏమిటది?

జవాబు: అద్దం



కనిపెట్టగలరా

ఇక్కడ చెట్లు ఆకారంలో కొన్ని గడులు, వాటిలో కొన్ని అంకెల్ని వుంచాం. అయితే వాటిలో కొన్ని గడులు ఖాళీగా వున్నాయి. మేం ఇచ్చిన అంకెల ఆధారంగా ఏ అంకెలొస్తాయో కనిపెట్టి ఖాళీగా వున్న గడులని నింపేయండి.

పదాలు గుర్తిద్దాం

పిల్లలూ మీకు ఐస్ క్రీమ్ అంటే ఎంతో ఇష్టం కదా! మీ కోసం ఇక్కడ రకరకాల ఐస్‌క్రీమ్ ఫ్లేవర్ల పేర్లని వుంచాం. పైనున్న అక్షరాల పట్టికలో ఆ పేర్లు ఎక్కడున్నాయో గుర్తించి పెన్‌తో మార్క్ చేయండి.



N	Y	T	A	E	D	N	R	D	Y	B	G	D	L	G	J
J	Y	B	U	G	C	V	W	I	S	I	B	R	F	N	I
N	I	E	A	T	Y	U	E	K	P	Q	R	E	R	K	C
D	C	T	H	Y	Y	I	A	C	R	B	C	T	M	N	D
Z	E	A	F	V	Z	Y	D	I	I	A	Y	S	S	Y	N
W	C	L	A	Y	N	I	N	A	N	N	C	Y	R	S	O
N	R	O	T	L	P	S	U	W	K	A	D	O	O	G	J
H	E	C	W	X	L	T	S	G	L	N	W	E	M	F	D
U	A	O	H	X	C	I	F	Q	E	A	P	A	C	Q	Y
X	M	H	B	K	G	P	N	Y	S	S	P	E	F	S	Q
O	F	C	C	O	N	E	T	A	H	P	D	D	Y	E	B
A	L	V	V	Y	G	F	S	J	V	L	Y	V	G	E	R
T	I	F	M	J	Z	R	S	D	P	I	U	F	S	B	T
N	F	F	C	T	Y	H	U	Q	L	T	G	B	P	A	H
Y	B	D	Q	G	W	O	U	T	J	O	R	Y	W	U	P
M	P	G	Q	H	G	U	R	B	N	A	C	T	Q	C	O

banana split · chocolate · cold

cone · ice cream · oyster

sprinkles · sundae · vanilla

wafer

రంగులు అద్దేద్దాం!

ఇక్కడున్న బొమ్మలో సున్నాలున్న భాగాన్ని రంగులతో నింపేస్తే కొన్ని బన్నీలు కనిపిస్తాయి. మొత్తం ఎన్ని బన్నీలు వున్నాయో గుర్తించి పక్కన రాసేయండే!.



బాటిల్ ఫ్లవర్‌వాజ్

పిల్లలూ! మీకు బొమ్మలు తయారుచేయడమంటే భలే ఇష్టం కదా... మీ కోసం మనింట్లో దొరికే వస్తువులతో అందమైన పూలు, ఫ్లవర్ వాజ్‌లని ఎలా తయారుచేసుకోవచ్చో మేం నేర్పిస్తాం. జాగ్రత్తగా మీరూ ప్రయత్నించండే...!

కావాల్సిన వస్తువులు

టిష్యూ పేపర్స్-4 (గులాబి రంగు), పాత వాటర్ బాటిల్ -1, టీ కప్పులు చిన్నవి-3/గుడ్ల పెట్టె-1, పైప్‌క్లీనర్-4(పసుపు, ఆకుపచ్చ రంగుల్లో), చాకు, గమ్ బాటిల్, స్కెచ్‌పెన్, కత్తెర.

తయారుచేసే విధానం

ముందుగా పాత వాటర్ బాటిల్‌ని తీసుకుని దానిపై వున్న స్టిక్కర్ మూత తీసేసి కొద్ది భాగం నీటితో నింపాలి. అందులో రంగు రంగుల పేపర్ ముక్కల్ని వేసి పక్కన పెట్టుకోవాలి. టిష్యూ పేపర్ తీసుకుని దానిపై తులిప్ పువ్వు రేకులు (చిన్నవి-4, పెద్దవి-4) ఆకారాన్ని గీసి కత్తెరతో కత్తిరించాలి. ఇప్పుడు గుడ్లపెట్టెను తీసుకుని 'వి' ఆకారంలో నాలుగు భాగాలని కత్తెరించుకోవాలి. ఒక్కో కప్పుకు గమ్ రాసి పక్కన పెట్టుకోవాలి. అవి పూర్తిగా ఆరకముందే ముందుగా కత్తిరించి పెట్టుకున్న టిష్యూపేపర్ పూరేకులు(చిన్నవి) నాలిగింటిని తీసుకుని లోపలి భాగంలో అతికించాలి. బైటి భాగంలో పెద్ద పూరేకులని అతికించాలి. ఇదే తరహాలో మీకు నచ్చినన్ని పువ్వులని తయారు చేసుకోవచ్చు. అవి పూర్తిగా ఆరిన తర్వాత ఒక్కో కప్పు అడుగు భాగంలో చిన్న రంధ్రాన్ని చేసి పైప్ క్లీనర్‌ని గుచ్చి గమ్‌తో అతికించాలి. ఇలా మీరు తయారు చేసిపెట్టుకున్న పూలన్నిటికీ ఒక్కో పైప్‌క్లీనర్‌లని గుచ్చి అరగంట సేపు పూర్తిగా ఆరనివ్వాలి. ఇప్పుడు అన్నిటినీ కలిపి ఒక గుత్తిలా కట్టి వాటర్ బాటిల్‌లో గుచ్చితే పేపర్ పూల వాజ్ రెడీ!



పదవికాసం - 56

కూర్పు: రావెళ్ల

✿	1	2		✿	3	4		✿
5	✿		✿	6	✿		✿	✿
7		✿	8			✿	9	10
	✿	11	✿		✿	12	✿	
13				✿	14			
	✿		✿	15	✿		✿	
16		✿	17			✿	18	
✿	✿	19	✿		✿	20	✿	
✿	21			✿	22			✿

ఆధారాలు

అడ్డం

1. కురుపాండవుల కథ (3)
3. ఐదు ముఖాలు కలిగిన సింహం (3)
7. పశువు మూతి (2)
8. వదరబోతు (3)
9. తోక తెగిన యజమాని (2)
13. అసలు పేరుకాక మరోపేరు (4)
14. నీతిని బోధించే శాస్త్రం అటు నుండి (4)
16. వణుకు (2)
17. బోధించడం (3)
18. అటు నుండి వయస్సు (2)
21. వద్దనండి (3)
22. మోసం (3)

నిలువు

2. రక్షించడం (2)
4. చిన్నకత్తి (2)
5. శ్రీకృష్ణదేవరాయుల రచన (6)
6. మురికి (3)
10. అతి తేలిక (6)
11. కాగితం ఆంగ్లంలో గజిబిజిగా (3)
12. విశాఖపట్నంలో ఒక నక్షత్రం (3)
15. వెతకడం (3)
19. పిల్లల్ని నిద్రపుచ్చేందుకు పాడేపాట (2)
20. లోతైన (2)

సుడోకు

9				8				
	2							3
		6		9	1	7	8	
	3			2		1		
8		4		1	6	2		
	6		8		9	5	4	
	9			6				5
		3		7		6		
		7	2			8		

7	9	3	5	1	4	8	2	6
5	2	4	7	8	6	1	3	9
8	1	6	2	9	3	4	5	7
9	3	8	6	2	1	7	4	5
2	4	5	9	3	7	6	8	1
1	6	7	4	5	8	2	9	3
3	7	1	8	4	5	9	6	2
4	5	9	1	6	2	3	7	8
6	8	2	3	7	9	5	1	4

గతవారం జవాబులు

1 స	మ్మో	2 ట	✿	3 రి	క్త	4 హ	స్తు	5 డు
మ	✿	పం	✿	ర్ప	✿	తం	✿	ము
6 ర	యం	✿	7 చే	నే	8 త	✿	9 మ	రా
భూ	✿	10 కో	యు	✿	11 తం	12 టా	✿	✿
13 మి	డ	త	✿	14 ప	✿	15 కీ	ల	16 క
✿	✿	17 లు	18 చ్చా	✿	19 కా	సు	✿	బ్జా
20 మా	డు	✿	21 స్వ	22 కా	ర్యం	✿	23 ఆ	దా
న	✿	24 దా	✿	మూ	✿	25 ట్టు	✿	రు
26 వి	య్యా	28 పు	రా	లు	✿	27 కొ	ట్లా	డు

పచ్చనిల్లు



పచ్చదనం కప్పుకున్న ఇళ్లను చూడాలంటే నార్వే గ్రామసీమలకు వెళ్లాలి. ఆకాశం నుంచి చూస్తే అక్కడసలు ఇల్లుందా అనిపిస్తుంది. ఇంటి పైకప్పు మీద నాచును పెంచడం స్కాండినేవియాలో వేలాది ఏళ్ల క్రితమే మొదలైంది. వైకింగ్‌ల కాలంలో ఇది తీవ్రమైంది. వీటిని టోర్వతక్ అని పిలుస్తారు. కొండ రావిచెట్టును పోలి ఉండే వృక్షాల బెరడును పైకప్పుల మీద వేసి వాటి కింద చెమ్మ, ఊట పట్టకుండా కలప దుంగల్ని వేసి మట్టిని పరచి నాచును పెంచుతారు. పూర్తిగా పెరిగాక ఇంటిపై అంతా పచ్చదనం పరుచుకుంటుంది. 18వ శతాబ్దం వరకు ఈ శైలి బాగా ఆదరణ పొందింది. 1950 వరకు ఇలాంటి ఇళ్లు ఎక్కువగా ఉండేవి. కానీ ఆ తర్వాత వచ్చిన బిల్డింగ్ అనుమతులు, ఇతర కారణాల వల్ల ఈ పద్ధతిని విడిచిపెట్టేయడం మొదలైంది. ఈ వింత, విలక్షణ గృహనిర్మాణ వారసత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రభుత్వం కొన్ని గృహాలను పరిరక్షిస్తోంది. చూడండి ఎంత పచ్చగా ఉన్నాయో ఈ గ్రామ సీమలు.



ఇక్కడి టీ ఫ్లేవరే వేరు

ఇక్కడి తేనీరుది మరణం ఫ్లేవర్. కొత్త జీవితం రుచి. ప్రాణాంతక ఈ ఆస్వాదన చైనాలోని హువాషాన్ టీ హౌజ్‌ది. లోపలికి మామూలు టీ హౌజ్‌లానే అనిపిస్తుంది. బయటికొస్తేనే కళ్లు తిరుగుతాయి. ముందు అసలు దాని వరకూ వెళ్లాలి కదా. ఏటవాలు పర్వతాలపై సన్నని ప్లాంకులు, గొలుసుల్ని ఆధారం చేసుకుని సమ్మిట్‌ను చేరితేకానీ ఆ టీ హౌజ్‌ను చూడలేం. అత్యంత ప్రమాదకరమైన ఈ మార్గం మధ్యలోనే మరణ భయాన్నిస్తుంది. పర్వతారోహకుల కల అందుకే అయ్యింది. వందల మీటర్ల లోయలో పడకుండా ఉండాలంటే కొండ రాతిపై తొలచిన జారుడు మెట్లకు అతుక్కుపోవాలి. ఐదు శిఖరాలుండే ఈ పర్వత ప్రాంతంలో ఒక్కో ఎత్తున ఒక్కో బుద్ధిస్ట్, దావోయిస్ట్ ఆలయాలుంటాయి. 'హెవెన్లీ స్టెప్స్' అనే ఏటవాలు మెట్లపై తొలుత హైకింగ్ మొదలెడితే... మధ్యలోకి వెళ్లేసరికి అక్కడ చెదలు పట్టిన సగం విరిగిన చెక్క ప్లాంకులు కనిపిస్తాయి. వాటి మీద జాగ్రత్తగా అడుగేస్తూ పర్వతాన్ని బలంగా పట్టుకుని పక్కకు నడిచాక తుప్పు పట్టిన గొలుసులు కనిపిస్తాయి. వాటి ద్వారా మరింత పైకి చేరుకునేది. దక్షిణ శిఖరానికి చేరాక గొండోలా పాస్ గుండా కాస్త భయం లేకుండా వెళ్లొచ్చు కానీ అవి విడిచిన తర్వాత వేసే ప్రతి అడుగు కూడా రిస్కే ఏడాదికి వందమందికి పైగానే సందర్శకులు పైనుంచి పడి చనిపోతున్నారట. అందుకే అక్కడి ప్రభుత్వం కొన్ని రక్షణ ఏర్పాట్లను చేసింది. ఇక్కడి థౌజెండ్ ఫూట్ ప్రెసిపైస్ (వేయి అడుగుల చరియ), హండ్రడ్ ఫూట్ క్రెవిస్ (వందడుగుల పగులు), బ్లాక్ డ్రాగన్ శిఖరం అత్యంత ప్రమాదకర జోన్లు. కానీ పైకి వెళ్లడానికి ఇష్టపడుతున్నారంటే 3000 ఏళ్లకు పైగా చారిత్రక ప్రాధాన్యమున్న ప్రాంతం కావటం. టెర్రకోట సైన్యం దొరికిన హువాయిన్ నగరం దగ్గరలో ఉంటుందీ ప్రాంతం. చివరకు 7087 అడుగుల ఎత్తులో ఉన్న టీ హౌజ్‌కు చేరుకుంటారు. టీ తాగడం కూడా ఓ ధ్యానంలానే ఉంటుంది ఇక్కడి సంప్రదాయం. అందుకే దీన్ని టీ హౌజ్‌లా కన్నా ధ్యాన కేంద్రంగానే పిలుస్తారు. ఎంత ప్రమాదకరంగా ఉన్నా కూడా చాలా మంది సందర్శకులు ఈ టీ హౌజ్‌లో తేనీరు రుచి, ఫ్లేవర్ తెలుసుకోవాలని ఉత్సాహం చూపుతున్నారు. అక్కడకెళ్లి టీ తాగి వస్తే జీవితమే మారిపోతుందని అనడంలో సందేహం లేదేమో.